www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల : 5.00

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 60 | మంగళవారం | 13 ఆగస్టు 2024

## గోల్కొండ కోట మీదే పంద్రాగస్టు

- సీఎం హోదాలో తొలిసారి త్రివర్ణ పతాకం ఎగురవేయనున్న రేవంత్
- ఏర్పాట్లు పర్యవేక్షించిన సీఎస శాంతి కుమారి

4 లో..

## కేసీఆర్ సంకల్పంతోనే సీతారామ పూర్తి


- కాంగ్రెస్ 7 నెలల్లోనే ప్రాజెక్ట్ పూర్తి చేసినట్లు బిల్డప్
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



2 లో..

## రాహుల్ ప్రమాదకర వ్యక్తి

సినీ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్



7 లో..



## రాష్ట్రంలో విద్యుత్ కోతలు

- పులికల్ దళితవాడే ఇందుకు నిదర్శనం
- ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేటీఆర్

హైదరాబాద్, ప్రజానావ:

రాష్ట్రంలో విద్యుత్ కోతలు కొనసాగుతూనే ఉన్నాయని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో అయితే రోజుల తరబడి కరెంట్ ఉండడం లేదు. తెలంగాణలో కరెంట్ కోతల్లేవని, అన్ని రంగాలకు 24 గంటల కరెంట్ అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. అయితే కరెంట్ కోతలపై ప్రభుత్వం అబద్ధాలాడుతోంది అన డానికి ఈ ఘటనే నిదర్శనం అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలం పులికల్ గ్రామంలోని దళిత వాడలో గత వారం రోజులుగా కరెంట్ లేదు. దళిత కుటుం బాలన్నీ చీకట్లోనే ఉంటున్నాయి. గ్రామంలోని ఇతర బీసీ కాలనీల్లో కరెంట్ ఉన్నప్పటికీ, దళిత వాడలో మాత్రం కరెంట్ లేదు. విషయంపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ద ళిత వాడలో వారం రోజులుగా కరెంట్ లేదు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జర చూడండి అని కేటీఆర్ ట్వీట్ చేశారు. దళితవాడ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై మండి పడుతున్నా రు. మాదిగలంటే ప్రభుత్వానికి ఇంత చిన్నచూ పా..? అని నిలదీస్తున్నారు. బీసీ కాలనీల్లో కరెంట్ ఉంది. సర్పంచ్ కూడా మా కాలనీకి రావడం లేదు. ఇప్పటికే అధికా రులను అడి గాం.. కానీ పట్టించుకోవడం లేదు.. కరెంట్ లేకపోవడంతో కాలనీలోకి పాములు వచ్చినా కనిపించడం లేదని, ఇప్పుడే ఒక పామును చంపామని దళితులు వాపోయారు.



## కొరియాలో సీఎం రేవంత్ బృందం

# పర్యటన

### ఆటోమోటివ్ దిగ్గజం హ్యుందాయ్ సంస్థతో చర్చలు

### మెగా కారు టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత

దక్షిణ కొరియాకు చెందిన ప్రఖ్యాత ఆటోమోటివ్ దిగ్గజం హ్యుందాయ్ మెగా కారు టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. మోటార్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. మెగా కారు టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు ఆ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. దీంట్లో ఆటోమేటివ్ టెస్ట్ ట్రాక్ సదుపాయంతో పాటు ఎలక్ట్రికల్ వాహనాలు సహా అత్యాధునిక టెస్ట్ కార్ల తయారీ సదుపాయం ఉ ండేలా ప్రణాళికలు రచిస్తోంది. హైదరాబాద్‌లో ఉన్న ఇంజినీరింగ్ కేంద్రాన్ని విస్తరించాలని హ్యుందాయ్ తెలిపింది. భారతీయ వినియోగదారుల కోసం బెంచ్‌మార్క్ ఉత్పత్తులు, సాంకేతికత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హ్యుందాయ్ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డి బృందానికి తెలిపారు.

సియోల్ :

హ్యుందాయ్ మోటార్ కంపెనీ తన అనుబంధ సంస్థ హెచ్ఎం ఐఈ ద్వారా తెలంగాణలో కార్ టెస్టింగ్ సదుపాయం నెలకొ ల్పేందుకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళిక చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పారిశ్రామిక స్నేహపూర్వక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఆటంకాలు లేని అను మతుల వ్యవస్థతో తెలంగాణలో వ్యాపారం చేసేందుకు హెచ్ ఎంఐఈ వంటి అత్యుత్తమ కంపెనీలు ముందుకు వస్తున్నాయ న్నారు. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగానూ భారీగా ఉపాధి అవకా శాలు కల్పించేందుకు దోహదపడుతుందని తెలిపారు. పెట్టుబ డులను ఆకర్షించడమే లక్ష్యంగా అమెరికాలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి బృందం ప్రస్తుతం కొరియాకు చేరుకొని అక్కడ పారిశ్రామికవేత్తలతో వరుస

మిగతా 2 లో

## సుప్రీంలో కవితకు

# దక్కని ఊరట

### మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ

### ఈడీ, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ

### విచారణ ఆగస్ట్ 20కి వాయిదా వేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ:

సుప్రీంకోర్టులో కవితకు ఊరట దక్కలేదు. ఆమెకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం తిరస్కరించింది. ఆమె బెయిల్ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. కవిత పిటిషన్‌పై సుప్రీంకోర్టు పెద్ద ట్విస్ట్ ఇచ్చింది. ఈడీ, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. స్పందన తెలియజేయాలని కేంద్ర ఏజెన్సీలను కోర్టు కోరింది. తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసుపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథ్ ధర్మాసనం విచారణ జరిపింది.సీబీఐ, ఈడీ కేసులలో బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.





## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

### అప్రమత్తం చేసిన వాతావరణ శాఖ

హైదరాబాద్, ప్రజానావ:

తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ వర్ష సూచ న చేసింది. ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. తెలంగాణలో 2 రోజుల పాటు వానలు పడతాయని సూచిం చింది. నిర్మల్, భూపాలపల్లి, ములుగు, ఆదిలా బాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కొత్తగూడెంలో వర్షాలు పడతాయని పేర్కొంది. ఇక భాగ్యన గరం హైదరాబాద్‌లో తేలికపాటి వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అప్రమత్తం చేసింది. సికింద్రాబాద్‌లో కూడా వర్షాలు పడతాయని పేర్కొంది.

మిగతా 2 లో

## సెల్‌ఫోన్ మాట్లాడుతూ చంకలో పెట్టుకున్న హీటర్

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

2 లో..



## మేఘా అక్రమాలను ఎందుకు పట్టించుకోరు

- కాంగ్రెస్ కూడా అదే సంస్థతో అంటకాగడమెందుకు
- బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి ప్రశ్న

హైదరాబాద్, ప్రజానావ: మేఘా కంపెనీ తెలంగాణలో 56 పనులు చేపడితే అందులో ఒక్కటీ పూర్తి కాలే దని, సుంకిశాల రిటర్నింగ్ వాల్ కూలితే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర ఆయన మీడియాతో మాట్లాడారు. పనుల్లో నాణ్యత

మిగతా 2 లో

## మెడికో హంతకులను వదిలేది లేదు

- ఎంతటి వారున్నా శిక్షించి తీరుతాం
- అవసరమైతే కేసు సిబిఐకి అప్పగిస్తా
- కుటుంబ సభ్యులను పరామర్శించిన సీఎం మమత

2 లో..



## వయనాడ్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

కానరాని 130 మంది ఆచూకీ



2 లో..

# కొరియాలో సీఎం రేవంత్ బృందం పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

భేటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇకపోతే వరం గల్ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు కొరియ న్ సంస్థలు ఆసక్తి కనబరు- స్తున్నాయి. కొరియా పర్యటనలో భాగంగా బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి.. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టాలని కోరారు. టెక్స్‌టైల్ రం గం విస్తృతికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కార్యాచరణ స్థానిక కంపెనీలతో పాటు ప్రపంచస్థాయి కంపెనీలకు అనుకూలంగా ఉందని సీఎం తెలిపారు. యంగాన్ కార్పొ రేషన్, కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్ సహా 25 అగ్రశ్రేణి టెక్స్‌టైల్ కంపెనీల అధినేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం రేవంత్‌రెడ్డి వారికి వివరించారు. సీఎం పిలుపునకు కొరియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ సానుకూలంగా స్పందించింది. అంతకముందు కొరియాలోని అతిపెద్ద పారిశ్రామిక వ్యవస్థల్లో ఒకటైన ఎల్.ఎస్.గ్రూపు ఛైర్మన్‌తో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. ప్రఖ్యాత ఎల్‌జీ గ్రూపు వ్యవస్థాపకులైన ఎల్.ఎస్. గ్రూపు కుటుంబాన్ని కలవడంతోనే కొరియా పర్యటన ప్రారంభం కావడంపై సీఎం హర్షం తెలిపారు. ఎలక్ట్రిక్ కేబుల్స్, బ్యాటరీల తయారీ, గ్యాస్, ఎనర్జీ తదితర రంగా ల్లో పెట్టుబడుల విస్తరణకు ఎల్ఎస్ గ్రూపు ఆసక్తి కనబరుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన ముగించుకున్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు



దక్షిణ కొరియాలోని సియోల్ చేరుకున్న ఆయన.. వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు.. ఇందులో భాగంగా ఆయన ఎల్ఎస్ (ఎల్‌జీ) గ్రూప్ ఛైర్మన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో విద్యుత్ కేబుల్, గ్యాస్, ఇంధన, బ్యాటరీల ఉత్పత్తిలో పెట్టుబడులపై చర్చించారు. త్వరలో తెలంగాణలో పర్యటించేందుకు ఎల్ఎస్ గ్రూప్ బృందం అంగీకరిం చింది. మరోవైపు కొరియా టెక్స్‌టైల్ పరిశ్రమ సమాఖ్యతో సీఎం రేవంత్‌రెడ్డి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చారు. వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కొరియా పెట్టుబడులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎనిమిది రోజుల పాటు అమెరికాలో సీఎం జరిపిన పర్యటన విజయవంతమైందని తెలంగాణ ప్రభు త్వం ఒక ప్రకటనలో తెలిపింది. సీఎం నిర్వహించిన స మీక్ష సమావేశాల ఫలితంగా.. 19 కంపెనీల ప్రతినిధులు తెలంగాణలో రూ.31,532 కోట్ల పెట్టుబడులు పెట్టేందు కు ముందుకు వచ్చినట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రతినిధి బృందం అమెరికాలో దాదాపు 50కి పైగా వాణిజ్య సంస్థలతో సమావేశమైందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, విద్యుత్ వాహనాలు, డేటా సెంటర్లు, ఐటీ, ఎలక్ట్రానిక్ రంగాల్లో పెట్టుబడులు పెట్టే దిశగా పలు సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేశాయని తెలిపింది.

## నామినేటెడ్ పదవుల్లో మహిళలకు అన్యాయం

**మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు అసహనం**

**హైదరాబాద్, ప్రజానావ:** జాతీయ స్థాయిలో తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ 'నారీ న్యాయ్' పేరుతో మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసేందుకు ప్రయత్నిస్తుండగా, తెలంగాణలో మాత్రం అందుకుభిన్నమైన వాతావరణం నెలకొన్నదని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం గాంధీ భవన్‌లో ఆమె మీడియాతో చిట్ చాట్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ కార్పొరేషన్ పదవులు సహా వివిధ ప్రభుత్వ పదవుల్లో మహిళలకు సమానవాటా దక్కలేదన్నారు. నామినేటెడ్ పదవుల్లో మహిళలకు అన్యాయం జరిగిందన్నారు. పార్టీలో గౌరవం దక్కడం లేదంటూ ఆమె కన్నీరు పెట్టుకున్నారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా 241 కార్యక్రమాలు నిర్వహించానని తెలిపారు. అయినప్పటికీ తనకు ఓడిపోయే గోషామహల్ అసెంబ్లీ సీటు ఇచ్చారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వం అని ఎన్నికలకు ముందు చెప్పారు. కానీ ఇప్పుడు ఓడిపోయిన వారికి కూడా పదవులు ఇచ్చారని సునీత రావు గుర్తు చేశారు. మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిని మార్చితేనే ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌కి వస్తానని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి దీపా దాస్ మున్షీ అన్నారని ఆమె తెలిపారు. తనకు ఇతర పార్టీల నుంచి ఆఫర్లు వచ్చినప్పటికీ.. పార్టీకి ద్రోహం చేయకుండా కష్టపడి పని చేశానని సునీత రావు పేర్కొన్నారు.

## డ్రగ్స్ కేసులో ఫెడ్లర్ మస్తాన్ సాయి అరెస్ట్

**గుంటూరు, ప్రజానావ:** హైదరాబాద్‌లోని వరలక్ష్మి టిఫిన్స్ డ్రగ్స్ కేసులో నిందితుడిగా ఉన్న ఫెడ్లర్ మస్తాన్ సాయిని ఏపీ స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో అరెస్ట్ చేసింది . గుంటూరులో మస్తాన్ సాయిని అరెస్ట్ చేసింది. జూన్ జూన్ 3న విజయవాడ రైల్వేస్టేషన్లో డ్రగ్స్ సరఫరా చేస్తుండగా సెబ్ పోలీసులు దాడులు చేశారు. పోలీసుల కళ్లు గప్పి పారిపోయాడు మస్తాన్ సాయి. మస్తాన్ సాయిపై నిఘా పెట్టిన పోలీసులు మస్తాన్ దర్గాలో తలదాచుకుండగా అరెస్ట్ చేశారు. రాజ్ తరుణ్, లావణ్య కేసులోమస్తాన్ సాయి పేరు వినిపించింది. అరెస్ట్ అయిన మస్తాన్ సాయి ఫోన్ లో చాలా మంది అమ్మాయిల వీడియోలు ఉన్నట్లు గుర్తించారు పోలీసులు. పలువురు అమ్మాయిల ప్రైవేట్ వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మస్తాన్ సాయి మొబైల్ లో వీడియోలపై ఆరా తీస్తున్నారు పోలీసులు . ఏపీ, తెలంగాణకు చెందిన అమ్మాయిలను టార్గెట్‌గా పెట్టుకుని మస్తాన్ సాయి మోసం చేసినట్లు గుర్తించారు పోలీసులు.

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

(మొదటిపేజీ తరువాయి)

నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. వర్షంలో ముందుకు కదలలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ఆకాశం మేఘావృతమై ఉంది. భారీ వర్షం కురుస్తుందని ఐఎండీతెలిపింది. ఆదివారం రాత్రి పలుప్రాంతాల్లో రికార్డు స్థాయి వర్షం పడిరది. ఉస్మానియా యూనివర్శిటీ ప్రాంతంలో సుమారు 90 మిల్లీవిరీటర్ల రికార్డు స్థాయి వర్షపాతం నమోద్కెంది. ఎన్‌సీహెచ్ కాలనీలో 87.5 మిల్లీవిరీటర్ల వర్షపాతం నమోద్కెంది. అడిక్‌మెంట్‌లో 80.8 మిల్లీవిరీటర్లు.. బౌద్ధనగర్‌లో 80.9. మి.విరీ. బారీ వర్షం కురిసింది. ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు, భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే నాలుగైదు జిల్లాలకు అధికారులు అరెంజ్ అలెర్టు జారీ చేశారు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీకి సంబంధించి సోమవారం సాయంత్రం, రానున్న రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నిన్న అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం 7 గంటల వరకు హైదరాబాద్ నగర ప్రాంతాలు షేక్‌పేట, టోలీ చౌక్, ఉత్తరపల్లి, రాజేంద్ర నగర్, లంగర్ హౌస్, ఉస్మానియా, తార్నాక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అలాగే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మణికొండ, హైటెక్‌సిటీ, అవిరీర్ పేట్, పంజాగుట్ట, ఫిలింనగర్, భరత్‌నగర్, బోరబండ, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, కోఠి ప్రాంతంలో కుండపోత వాన పడిరది. ఉప్పల్, ఎల్‌బీనగర్, ఎస్‌ఆర్ నగర్‌లోనూ వర్షం దంచికొట్టింది. భారీ వర్షంతో పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. ఈ క్రమంలో పలుచోట్ల వాహనదారులు తమ వాహనాలను రోడ్డు పక్కన నిలిపివేశారు.

## మేఘా అక్రమాలను ఎందుకు పట్టించుకోరు

(మొదటిపేజీ తరువాయి)

లోపిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే కాంట్రాక్టు సంస్థతో ఎందుకు పనులు చేయిస్తున్నదంటూ ప్రశ్నించారు. మేఘా సంస్థ కేరళలో చేసిన పనుల్లోనూ నాణ్యత ప్రమాణాలు పాటించలేదని కేంద్రం షోకాజ్ నోటీసులు జారీ చేసిందని చెప్పారు. ఇంత జరుగుతున్నా ఆ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నోటీసులు జారీ చేయడం లేదని ప్రశ్నించారు. మేఘా చేసిన పనులను ఎందుకు పబ్లిక్ డొమయిన్లో పెట్టడం లేదన్నారు. కూలిపోయిన కాళేశ్వరం, సుంకిశాల పనులను మేఘాతోనే మళ్లీ చేయించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర, జార్ఖండ్‌లలో త్వరలో జరగబోయే ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీకి మేఘా కంపెనీ నిధులు సమకూర్చుతోందని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక పరిస్థితి ప్రమాదంలో ఉందని, గత బీఆర్‌ఎస్ సర్కారు అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి మళ్లీ 62 వేల కోట్ల అప్పు తెచ్చారని అన్నారు.

సీఎం కాకముందు అవినీతి పై ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి.. ఆ తర్వాత ఎందుకు విచారణ చేపట్టలేదని ప్రశ్నించారు.

## వయనాడ్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

**ఇంకా ఆచూకీ లేని 130 మంది జాడ**

**వయనాడ్ :** కనీవినీ ఎరుగని విలయాన్ని చూసిన వయనాడ్‌లో ఇంకా విషాదకర పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే 200లకు పైగా మృతదేహాలను గుర్తించగా.. అనేక మంది జాడ ఇంకా లభించలేదు. దీంతో రెండు వారాలుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతూనే ఉంది. సుమారు 130 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు పేర్కొన్నారు. వీరి కోసం చలియార్ నది, పరిసర అటవీ ప్రాంతాల్లో ముమ్మర గాలింపు చేపట్టినట్లు వెల్లడించారు. వయనాడ్‌లో జులై 30న కొండ చరియలు విరిగిపడిన ఘటనలో 229 మంది చనిపోయినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. వీరిలో 51 మందిని ఇంకా గుర్తించాల్సి ఉందని తెలిపింది. వీరికి సంబంధించిన డీఎన్‌ఏ నివేదిక ఆగస్టు 13లోగా వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు దాదాపు 130 మంది ఆచూకీ ఇంకా లభించలేదని ప్రభుత్వం వెల్లడించింది. వీరికోసం గడిచిన రెండు వారాలుగా ముమ్మర గాలింపు కొనసాగుతోంది. ఎన్డీఆర్‌ఎఫ్, పోలీస్, అగ్నిమాపక, అటవీ శాఖలకు చెందిన 190 మంది సభ్యుల బృందం.. వరదలు చోటుచేసుకున్న ప్రాంతాన్ని జల్లెడపడుతున్నాయి. ఇందులో భాగంగా చలియార్ నది, దాని పరివాహక ప్రాంతాలు, సమీప అడవులపై దృష్టిసారించినట్లు ఏడీజీపీ ఎం ఆర్ అజిత్ కుమార్ పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలను ఇప్పటికే ఒకసారి గాలించామని, తాజాగా నది, దాని తీర ప్రాంతాలపై దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. ఎగువ ప్రాంతం మొత్తం పూర్తికాగా, ప్రస్తుతం దిగువన తమ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. అయితే, నీటి స్థాయిలు తగ్గడంతో మృతదేహాలు బయటకు వస్తున్నాయని చెప్పారు. భారీ వర్షం కారణంగా సెర్చ్ ఆపరేషన్‌కు అంతరాయం కలుగుతోందన్నాయి. అయితే, సోమవారం చేపట్టిన గాలింపులో పలు శరీర భాగాలు లభ్యమైనట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

## సెల్‌ఫోన్ మాట్లాడుతూ చంకలో పెట్టుకున్న హీటర్

**విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి**

**ఖమ్మం, ప్రజానావ:** ఒకవైపు ఫోన్ మాట్లాడుతూ.. యథాలాపంగా మరో పని చేపట్టే అలవాటున్న వారికి హెచ్చరిక లాంటి ఘటన ఇది. మొబైల్ ఫోన్ మాట్లాడుతున్న ఓ వ్యక్తి.. అనాలోచితంగా విద్యుత్ హీటర్‌ను చంకలో పెట్టుకోవడంతో షాక్ తగిలి మృతిచెందాడు. ఖమ్మంలో జరిగిన ఈ ఘటనపై మూడో పట్టణ పోలీసు స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కాల్వ ఒడ్డునున్న హనుమాన్ గుడి సమీపంలో దోనెపూడి మహేశ్‌బాబు (40) కొబ్బరికాయల వ్యాపారం చేస్తుంటారు. ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో ఆయన ఇంట్లో పెంపుడు కుక్కకు స్నానం చేయించేందుకు వేడినీళ్ల కోసం హీటర్ ఆన్ చేయబోయారు. ఈలోగా ఫోన్ రావడంతో మాట్లాడుతూ.. హీటర్‌ను నీటిలో బదులు చంకలో పెట్టుకుని స్విచ్ ఆన్ చేశారు. దీంతో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయారు. దగ్గర్లో ఉన్న ఆయన తొమ్మిదేళ్ల కుమార్తె శభన్య భయంతో కేకలు వేస్తూ పరుగెత్తింది. దీంతో అప్రమత్తమైన భార్య దుర్గాదేవి, స్థానికులు మహేశ్‌బాబును ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మహేశ్‌బాబు దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు.

## రేవంత్‌పై సోషల్ మీడియాలో కారుకూతలు

**• అమెరికా పర్యటనను తట్టుకోలేక పోతున్న • బీజేపీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం**

**హైదరాబాద్, ప్రజానావ:** రాష్ట్రం కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న రేవంత్‌పై సోషల్ మీడియాలో కారుకూతలు కూస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ అమెరికా పర్యటన విజయవంతం కావడం బీఆర్‌ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి అమెరికాకు సరికొత్త తెలంగాణను పరిచయం చేశారన్నారు. పెట్టుబడులకు తెలంగాణను స్వర్గంగా మార్చుతున్నారని అన్నారు. సూటు బూటు వేసుకొని దావోస్ వెళ్లిన కేటీఆర్ ఎన్ని కంపెనీలను తెలంగాణకు తెచ్చారని ప్రశ్నించారు. కేటీఆర్ ఏంవోయూ కుదుర్చుకున్న కంపెనీలన్నీ ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయన్నారు. ఒప్పందం చేసుకున్న కంపెనీలకు గత ప్రభుత్వం సరైన వసతులు కల్పించలేదని విమర్శించారు. రేవంత్ సక్సెస్ తక్కువ చేసి చూపించేందుకు బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కష్టపడుతోందని వ్యాఖ్యలు చేశారు. బుర్రలేని వాళ్ళు కేటీఆర్ రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నారన్నారు. అంగుళం భూమి కేటాయించకముందే మనీ లాండరింగ్ జరిగిందని ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. తప్పులు చేసి తీహార్ జైల్లో ఎవరున్నారో ప్రజలకు తెలుసన్నారు. కేటీఆర్ పదేండ్ల సూటు బూటు హడావిడికి రేవంత్ కేవలం 8 నెలల్లోనే సమాధానం చెప్పారని అన్నారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలు, మరోవైపు ప్రైవేట్ ఉద్యోగాల కల్పన చేస్తుంటే బీఆర్‌ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. తెలంగాణ అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం



చేశారు. మూడు సార్లు దావోస్ పోయి కంపెనీలు తెచ్చానన్న కేటీఆర్ దానిలో ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. 'విదేశీ పర్యటనల పేరుతో దుబాయి వెళ్లి సొంత బిల్డింగులు కొనుక్కున్న మీతో రేవంత్‌కుకి పోలికా?' అంటూ మండిపడ్డారు. కేటీఆర్ ఇచ్చిన స్క్రిప్ట్ చదివి దిగజారవద్దని బీఆర్‌ఎస్ నేతలకు సూచనలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే పనిచేస్తే వారి పని ఖతం అవుతుందని బీఆర్‌ఎస్ నేతలు భయపడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలు చేశారు.

## బాలికల కిడ్నాప్ ఛేదించిన పోలీసులు

**• బాలికలను నమ్మించి కిడ్నాప్**

**• నిందుతుడు వెంకటేశ్ పట్టివేత**

**రాజమండ్రి, ప్రజానావ:** జల్సాలకు అలవాటుపడి ఇద్దరు బాలికలను కిడ్నాప్ చేసిన నిందితుడు వెంకటేష్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఈ కేసు దర్యాప్తులో విస్తుగొల్పే విషయాలు బయటకొచ్చాయి. ఎస్పీ నర్సింహ కిశోర్ కేసు వివరాలను వెల్లడించారు. 'గత నెల జులై 27న సాయంత్రం నెల్లూరులో పిల్లలతో కలిసి నిందితుడు కనిపించాడు. అతను ఇతర ప్రాంతాల్లో మూడు లాడ్జీల్లో ఉన్నాడు. విజయవాడ, గుంటూరు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు ప్రత్యేక బృందాలను పంపి గాలించాం. నెల్లూరు పోలీసులు, స్థానికులు ఆర్పీఎఫ్‌జీఆర్పీ సాయంతో.. నిందితుడు చెన్నై మీదుగా పిల్లలను ఊటీ తీసుకెళుతుండగా పట్టుకున్నట్లు వెల్లడించారు. విజయనగరం జిల్లా పెదమానాపురం గ్రామానికి చెందిన వెంకటేష్ ఒక యువతిను పెళ్లి చేసుకుని విడిచిపెట్టాడు. జల్సాలకు అలవాటుపడి కిడ్నాప్‌లు తదితర దందాలు చేస్తున్నాడు. నిందితుడుపై బలమైన కేసులు నమోదు చేసి శిక్ష పడేలా చేస్తాం. ఆడపిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి' అని కిశోర్ సూచించారు. బాలికలను కిడ్నాప్ చేసేందుకు నిందితుడు వెంకటేష్ తాను రైల్వే టీసీగా పని చేస్తున్నట్లు సదరు బాలికల తల్లిని నమ్మించాడు. ఒడిశా బరంపురానికి చెందిన సునీత కుటుంబం కొన్నేళ్లుగా ధవళేశ్వరంలో నివాసం ఉంటోంది. సునీత దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాకినాడలో హాస్టల్లో ఉంటున్న వీరి కూతుళ్లలో ఒకరు 9, మరొకరు పదో తరగతి చదువుతున్నారు. ఇదిలావుండగా, గత నెల 22న వెంకటేష్ అనే యువకుడు సునీతతో తాను రైల్వే టీసీ అని చెప్పి బాలికలను తన వెంట తీసుకెళ్లాడు. అయితే చివరకు కనిపించకుండా పోవడంతో తల్లి పోలీసులను ఆశ్రయించింది. పిఠాపురంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మను కలిసి తమ కూతుళ్లను రక్షించాలని కోరింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహా కిశోర్.. నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తు క్రమంలో అతను తన భార్యను వదిలిపెట్టి ఓ యువతితో సహజీవనం చేస్తున్నట్లు గుర్తించారు.

## కేసీఆర్ సంకల్పంతోనే సీతారామ పూర్తి

**• కాంగ్రెస్ 7 నెలల్లోనే ప్రాజెక్ట్ పూర్తి చేసినట్లు బిల్డప్**

**• మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు**

**హైదరాబాద్, ప్రజానావ:** సీతారామ ఎత్తిపోతల పథకం కేసీఆర్‌కు ఇష్టమైన ప్రాజెక్టు అని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విరీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాకు కరవు బాధలు తీర్చాలని సీతారామ ప్రాజెక్టు కోసం సంకల్పం చేసింది కేసీఆర్ అని అన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా దాన్ని నిర్మించాలను కున్నారని చెప్పారు. '8 నెలల్లో సీతారామ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందా? కాంగ్రెస్ నేతలు పరాన్న జీవులుగా ప్రవర్తిస్తున్నారు. వారి ప్రవర్తనతో ప్రజలు నవ్వుకుంటున్నారు. ఖమ్మం జిల్లాలో మంత్రులు పోటీపడి పర్యటనలు చేస్తున్నారు. మేము ఇచ్చిన ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని చెప్పుకొంటు న్నారు. మేము చేసిన ప్రతి మంచి పని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని చెప్పుకొంటున్నారు. కేసీఆర్ కాకుండా సీతారామ ప్రాజెక్టును వేరేవారు రూపకల్పన చేసి ఉంటే అంత బాగా ఉండేదా? కాంగ్రెస్ పాలనలో ఖమ్మం జిల్లాకు చుక్క నీరు కూడా ఇవ్వలేదు. కానీ, కేసీఆర్ ఈ జిల్లాలో రెండు పంటలు పండే విధంగా ప్రాజెక్టు రూపకల్పన చేశారు. వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆలోచన చేశారు. 8 ప్యాకేజీల్లో 5 భారాస ప్రభుత్వం చేసిందే. మరో 3 ప్యాకేజీల్లో 80 శాతం పనులు మేమే పూర్తి చేశాం' అని హరీశ్‌రావు తెలిపారు.



## మెడికో హంతకులను వదిలేది లేదు

**• ఎంతటి వారున్నా శిక్షించి తీరుతాం**

**• కుటుంబ సభ్యులను పరామర్శించిన సీఎం మమత**

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ లో జూనియర్ మెడికో మర్డర్ పై ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ స్పందించారు. సోమవారం ఉదయం మృతురాలి ఇంటికెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించిన మమత.. కేసును వారం రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. ఆగస్టు 18 నాటికి పోలీసులు దర్యాప్తు పూర్తి చేయకపోతే సీబీఐకి అప్పగిస్తామని తెలిపారు. కేసులో ఎంత మంది నిందితులున్నా..వారందరినీ ఆదివారంలోగా అరెస్ట్ చేస్తామన్నారు. ఈ కేసు విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆమె పోలీసులకు డెడ్ లైన్ విధించారు. మరో వైపు మెడికో మర్డర్ పై ఆందోళనలు మరింత ఉధృతమవుతున్నాయి. ఖీఉ కర్ హాస్పిటల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సందీప్ ఘోష్ తన పోస్టుకు రిజైన్ చేశారు. అటు దేశ వ్యాప్తంగా పలు రకాల వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రకటించింది. హాస్పిటల్స్ జూనియర్ డాక్టర్ల భద్రతకు కేంద్రం ప్రోటోకాల్ రిలీజ్ చేయాలని ఫోర్డా డిమాండ్ చేసింది.

# దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు

### స్మితా సబర్వాల్‌పై చర్యలు కోరుతూ పిల్

**హైదరాబాద్, ప్రజానావ:** దివ్యాంగులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు గానూ ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని హైకోర్టులో పిల్ దాఖలైంది. సామాజికవేత్త వసుంధర పిటిషన్ దాఖలు చేశారు. స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని యూపీఎస్సీ చైర్మన్‌కు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో ఆమె కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారించింది. అయితే.. ఈ సందర్భంగా కోర్టు కొన్ని కీలక ప్రశ్నలు సంధించింది. పిటిషనర్‌కు ఉన్న అర్హతను హైకోర్టు ప్రశ్నించింది. పిటిషనర్ ఒక వికలాంగులారని అడ్వకేట్ తెలిపారు. పూర్తి వివరాలతో అఫిడవిట్ సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. దివ్యాంగులు ఐఏఎస్‌లుగా పని చేయలేరంటూ అవమానించేలా సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సబర్వాల్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని సీఎస్ బీ ఐఏఎస్ అకాడమీ చీఫ్, మాజీ ఐఏఎస్ మల్లవరపు బాలలత ఇటీవల డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పదవిలో ఉన్న ఒక ఐఏఎస్ ఆఫీసర్ ఇలాంటి పోస్టు పెట్టడం దారుణమని, ఆమెపై సీఎం రేవంత్ రెడ్డి, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమా లేక ప్రభుత్వ అభిప్రాయాలా అని ప్రశ్నించారు. రిజర్వేషన్లు కల్పిస్తున్న రాజ్యాంగాన్ని, సుప్రీం కోర్టు తీర్పులను కూడా ఆమె వ్యతిరేకిస్తున్నారా? అన్నది చెప్పాలన్నారు. దివ్యాంగులు ఎక్కువ సేపు పని చేయలేరంటూ వారి సామర్థ్యాన్ని నిర్ణయించడానికి స్మితకు ఏం అధికారం ఉందని ప్రశ్నించారు. ఏ అంశాల ప్రాతిపదికగా ఆమె ఈ నిర్ణయానికి వచ్చిందో చెప్పాలన్నారు. 'స్మితా సబర్వాల్ కు, నాకు సివిల్స్ ఎగ్జామ్ పెట్టండి. ఎవరికి ఎక్కువ మార్కులు వస్తాయో చూద్దాం' అని బాలలత ఓపెన్ చాలెంజ్ చేశారు. 'సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టగానే తొలి ఉద్యోగం ఒక దివ్యాంగురాలికి ఇచ్చారు. ఆమె సామర్థ్యాన్ని చూసి ఇచ్చారా లేదంటే ఊరికే ఇచ్చారా అన్నది సీఎం స్పందించి తెలియజేయాల్సిన అవసరం ఉన్నది' అని ఆమె కోరారు.

# కోల్‌కతా హత్యాచార ఘటనపై దేశవ్యాప్త ఆందోళన

- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న ప్రజలు
- నిందితుడిలో ఏ కోశాన కానరాని పశ్చాత్తాపం
- ఉరితీసుకున్నా ఫర్వాలేదంటూ తలబిరుసు సమాధానం




**కోల్‌కతా:** కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా కుదిపేస్తోంది. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ నిరసనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ కేసులో సంచలన విషయాలను పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడి గురించి పోలీసులు వివరాలు తెలిపారు. కోల్‌కతాలోని ఆర్జీకార్ మెడికల్ కళాశాలలో నిందితుడు వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన అనంతరం తాను ఉండే ప్రాంతానికి తిరిగొచ్చి హాయిగా నిద్రపోయినట్లు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత ఉదయం సాక్ష్యాలను చెరిపివేయడానికి తన దుస్తులపై ఉన్న రక్తపు మరకలను తుడిచి పెట్టేందుకు ఉతుక్కున్నాడని చెప్పారు. అయితే.. అతడి బూట్లపై ఉన్న రక్తపు మరకల ఆధారంగా నిందితుడిని గుర్తించినట్లు తెలిపారు. పౌర వాలంటీర్ అయిన నిందితుడికి ఈ ఆస్పత్రితో ఎలాంటి సంబంధం లేదని.. అప్పుడప్పుడు ఇక్కడికి వస్తాడని విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన అనంతరం సిటీ పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ మెడికల్ కళాశాలను రెండో రోజు పరిశీలించారు. నిరసనకు దిగిన వైద్యులతో సమావేశమయ్యారు. విచారణ పారదర్శకంగా జరుగుతోందని.. ఈ కేసులో ఎలాంటి వదంతులను వ్యాపింపజేయవద్దని కోరారు. ఈ కేసులో ఇంకెవరి ప్రమేయమైనా ఉందా..? అన్న ప్రశ్నకు స్పంది స్తూ.. ఇప్పటి వరకూ అలాంటి ఆధారాలు లభించలేదని.. బాధితురాలి తుది పోస్టుమార్టమ్ నివేదిక కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. తమ దర్యాప్తులో లభించిన ఆధారాలతో నివేదికను పోల్చి చూడాల్సి ఉంటుందని వెల్లడించారు. ప్రాథమిక పోస్ట్‌మార్టమ్ నివేదిక ప్రకారం.. బాధితురాలి కళ్లు, నోరు, అంతర్గత అవయవాల నుంచి రక్తస్రావం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇతర భాగాల్లో కూడా గాయాలు ఉన్నట్లు తేలింది. అయితే.. వైద్యురాలిని మొదట హత్య చేసి.. ఆ తర్వాత నిందితుడు అత్యాచారా నికి పాల్పడి ఉంటాడని మరో పోలీసు అధికారి వెల్లడిం చారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ పనిచేసిన సిబ్బందిని విచారించినట్లు.. సీసీ టీవీ దృశ్యాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేపట్టినట్లు వివరించారు. నిరసనకు దిగిన జూనియర్ డాక్టర్లతో చర్చలు చేపట్టామ ని.. వారి డిమాండ్ మేరకు ఓ పోలిస్ అధికారిపై చర్యలు తీసుకున్నట్లు పోలీసు కమిషనర్ వెల్లడించారు. ఈ కేసు విషయంలో పోలీసులు ఎలాంటి విషయాలను దాచడం లేదని తెలిపారు. మరోవైపు జూనియర్ వైద్యులు తమ డిమాండ్లు పూర్తిగా నెరవేరే వరకూ నిరసనను కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. నిందితుడు సంజయ్ రాయ్ దర్యాప్తు సమయంలో ఎటువంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోగా.. తనను ఉరి తీయాలనుకుంటే తీసు కోవాలంటూ.. ఎదురుచెప్పినట్లు పోలీసులు చెబుతున్నా రు. అతడి ఫోన్ నిండా అశ్లీల వీడియోలు ఉన్నట్లు తెలు స్తోంది. అతడికి ఇప్పటికే నాలుగు పెళ్లిళ్లు జరిగినట్లు సమాచారం. ఈ ఘటన చోటుచేసుకునే ముందు మృతు రాలి గురించి పలు విషయాలను తోటి సిబ్బంది తెలిపా రు. గురువారం రాత్రి విధుల్లోకి వచ్చిన ఆమె.. ఒలింపిక్స్ పోటీలను వీక్షించినట్లు చెప్పారు. ఈ ఘటన చోటు చేసుకోవడానికి కొన్ని గంటల ముందు నీరజ్ చోప్రా జావెలిన్ త్రో ఆమె వీక్షించినట్లు తెలిపారు. తన తోటి సిబ్బందితో కలిసి డిన్నర్ చేసి.. ఆ తర్వాత తల్లికి ఫోన్ చేసి మాట్లాడినట్లు వివరించారు. ఆ తర్వాత ఆమె సెమి నార్ హాల్‌లో చదువుకునేందుకు వెళ్లిపోయిందని పేర్కొ న్నారు. మరోవైపు ఈ కేసు రాజకీయ రంగు పులుము కోవడంతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఆదివారం లోగా కోల్‌కతా పోలీ సులు కేసును పరిష్కరించలేకపోతే.. దీన్ని సీబీఐకి అప్పగి స్తామన్నారు. ఈ ఘటనపై ప్రతిపక్ష భాజపా నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్న వేళ దీదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

# పెట్టుబడులే లక్ష్యంగా సీఎం రేవంత్ పర్యటన

### బీఆర్ఎస్ దుష్ప్రచారాలపై ఎంపి చామల మండిపాటు



**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణకు పెట్టుబడులే లక్ష్యంగా విదేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన కొనసాగుతుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. అమెరికా పర్యటన ముగిసి దక్షిణ కొరియాకు సీఎం రేవంత్ బృందం వెళ్లిందని చెప్పారు. ఇప్పటివరకు రూ.31,500 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి పలు కంపెనీలు ముందుకొచ్చాయని అన్నారు. ఐటీ, ఫార్మా, ఏఐ కంపెనీలతో పాటు మరికొన్ని కంపెనీలు ఇన్వెస్ట్ చేయడానికి అగీకరించాయని చెప్పారు. 8 నెలల్లో రెండు సార్లు విదేశీ పర్యటనలు జరిగాయని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు అందరికీ తెలుసునని చెప్పారు. చెప్పినట్టుగా సీఎం రేవంత్ రైతు రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. అయితే బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ సర్కార్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ విదేశీ పర్యటనపై కూడా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తాము తప్పులు చేస్తే నిలదీయండి కానీ బురద జల్లవద్దని హితవు పలికారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో పదేళ్లు కుటుంబ పాలన సాగిందని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. వారే అన్ని పదవులు పొందారని అన్నారు. జాబ్ క్యాలెండర్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ సర్కారుదేనని తెలిపారు. అక్రమంగా సంపాదించిన సొమ్ముతో సోషల్ విరీడియాను పెంచి పోషిస్తున్నారని విమర్శలు చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ బంధువులెైన తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి వస్తే స్వాగతిస్తామని అన్నారు. తప్పుడు ప్రచారాలను మానుకోవాలని సూచించారు. పదేళ్లు చేయనిది.. 8 నెలల్లోనే చేయాలని ప్రశ్నించారు. కొంత సమయం ఇస్తే అన్ని పూర్తి చేస్తామని వివరించారు. ÷రీశేశ్వరం, సుంకిశాల కూలడానికి తామే కారణం కాదని .. సుంకిశాల తప్పిదం బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు. బీజేపీ ఎంపీలు 8 మంది ఉన్నారు. కాంగ్రెస్ ఎంపీలు కూడా 8 మంది ఉన్నామని అందరం కలిసి కేంద్రం నుంచి తెలంగాణకు అభివృద్ధి కోసం నిధులను తెచ్చుకుందామని చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు.

# దక్షిణ భారత దేశంలోనే పెద్ద బౌద్ధ స్థూపం

- భక్త రామదాసు జన్మస్థలం, పాలేరు రిజర్వాయర్
- మూడింటినీ పర్యాటక కేంద్రాలుగా మారుస్తం
- డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశం
- నేలకొండపల్లిలో మంత్రులు పొంగులేటి, జూపల్లితో కలిసి పర్యటన

**ఖమ్మం, ప్రజానావ:** నేలకొండపల్లిలోని బౌద్ధ స్థూపం ఒకటో శతాబ్దం నాటిదని, 8 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ స్థూపం దక్షిణ భారత దేశంలోనే పెద్దదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఆయన మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ రఘురామిరెడ్డితో కలిసి బౌద్ధస్థూపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ బుద్దిస్ట్ మ్యూజియం ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. అండర్ గ్రౌండ్లో ఆనాటికి సంబంధించిన శిలలు ఉన్నాయన్నారు. బౌద్ధ స్థూపాన్ని ఇండియాలనే ది బెస్ట్ గా తీర్చిదిద్దుతామని తెలిపారు. అభివృద్ధి కి కావలసిన నిధులు మంజూరు చేస్తామని అన్నారు. ఇందుకోసం డీపీఆర్ సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. నేలకొండ పల్లికి మరో ప్రత్యేకత ఉందని, భక్తరామదాసు జన్మస్థలమని దానిని మరింత అభివృద్ధి చేస్తామని, కాంగ్రెస్ హయాంలో నిర్మించిన పాలేరు రిజర్వాయర్ కూడా ప్రత్యేకత అని ఈ మూడింటిని అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకులను విశేషంగా ఆకర్షించవచ్చన్నారు. తమ ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి పర్యటకులను నేలకొండపల్లి ఆకర్షిస్తోందని, ఇంకా ఎక్కువ మంది ఈ కేంద్రాలను సందర్శించేలా వసతులు మెరుగుపరచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

# మౌనంగా ఉండడం భావ్యం కాదు

- ఒక దేశంలోని అంతర్గత వ్యవహారాల్లో తల దూర్చడం సరైన చర్య కాదు
- అలా చేస్తే.. విదేశాంగ విధాన వైఫల్యమే అవుతుంది
- సమాజ్వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** తమ రాజకీయ ఉద్దేశాలను నెరవేర్చుకు నేందుకు పొరుగు దేశంలోని పరిస్థితులను ఉపయోగించుకుంటే చివరికి ఆ దేశమే బలహీన పడుతుందని సమాజ్వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. అయితే.. ఆయన ఏ దేశం పేరును ప్రస్తావించలేదు. అయితే.. బంగ్లాదేశ్లో పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది."ఒక దేశం లోని పరిస్థితులను మరో దేశం ఆసరాగా చేసు కుని.. తమకు అనుగుణంగా ఉపయోగించు కోవాలనుకుంటే అది వారిని అంతర్గతంగా, బాహ్యంగా బలహీనపరుస్తుంది. వాస్తవానికి ఒక దేశంలోని అంతర్గత వ్యవహారాల్లో తల దూర్చడం సరైన చర్య కాదు. అక్కడ ప్రదర్శనలు హింసాత్మకంగా మారితే.. మౌనంగా ఉండడం భావ్యం కాదు. అది విదేశాంగ విధాన వైఫల్యమే అవుతుంది" అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా అఖిలేశ్ పేర్కొన్నారు. నాలుగు గంటల వ్యవధిలో ఆయన చేసిన మరో పోస్టులో బంగ్లాదేశ్ పేరును ప్రస్తావించారు. "సరైనదా కాదా అనే విషయాలను పక్కనపెడితే.. పలు సందర్భాల్లో, వివిధ కారణాలతో అనేక దేశాల్లో హింసాత్మక విప్లవాలు, సైనిక తిరుగుబాట్లు, ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు జరుగుతున్నా యి. అటువంటి సమయంలో ఆ ఒక్క దేశం మాత్రమే తిరిగి పుంజుకుంది. బంగ్లాదేశ్లో శాం తి స్థాపనకు కేంద్రప్రభుత్వం మరింత కృషి చేయాలి. మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన ఈ అంశాన్ని భారత ప్రభుత్వం అంత ర్జాతీయ స్థాయిలో లేవనెత్తాలి" అని పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్లో పరిణామాల నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాగా.. రిజర్వేషన్ల అంశం పెట్టిన చిచ్చు బంగ్లాదేశ్లో ఆందోళనలను రగిలి స్తూనే ఉంది. ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా ప్రస్తుతం భారత్లో ఆశ్రయం పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం స్పందించిన తీరుపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ప్రశంసలు కురిపించారు. ఆమెకు మనం సాయం చేయకపోతే.. అది భారత్కు అవమానమేనన్నారు. భవిష్యత్తులో ఎవరూ మనకు మిత్రులుగా ఉండేందుకు ఇష్టపడేవారు కాదన్నారు. తాజాగా ఈ అంశంపై స్పందించిన అఖిలేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు.



# రూ.33వేలు డిమాండ్ చేస్తున్నారు

- నా మొబైల్, వాట్సాప్ చేసిన హ్యాకర్లు
- ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే

**పుణె:** తన మొబైల్ ఫోన్, వాట్సాప్ హ్యాక్ చేసిన హ్యాకర్లు రూ.33,000 డిమాండ్ చేస్తున్నారని ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే వెల్లడించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి అదితి నలవాడేకు చెందిన వాట్సాప్ ఖాతా కూడా హ్యాక్ చేసి, ఆమె నుంచి రూ.10వేలు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. హ్యాకర్ల గురించి తెలుసుకోవడా నికి డబ్బు చెల్లించడానికి ఒప్పుకున్నామని వారు బ్యాంకు అకౌంట్ల వివరాలు తమకు పంపారని వెల్లడించారు. హ్యాకింగ్ విషయంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, హ్యాకర్లు పంపిన బ్యాంక్ అకౌంట్ వివరాలు వారికి అంద జేస్తామన్నారు. కాగా తన ఫోన్ హ్యాక్ అయ్యిందని ఎవ రూ మెసేజ్ లేదా ఫోన్ చేయొద్దని ఆమె విజ్ఞప్తిచేసిన విషయం తెలిసిందే. తాను పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నానని.. అందరూ గమనించాలని కోరుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

**ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసు అందింది..**

బడ్జెట్ సెషన్ తర్వాత తనకు ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు అందాయని సుప్రియా సూలే వెల్లడిం చారు. "పార్లమెంటులో నేను మాట్లాడిన ప్రతిసారీ, అదే సమయంలో ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు ఎందుకు వస్తున్నాయో మాకు అర్థం కాదు" అని అన్నారు. సుప్రియా సూలే కేంద్ర మాజీ మంత్రి, ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్ కుమార్తె. ప్రస్తుతం ఎన్సీపీ (ఎస్పీ) కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా ఉన్నారు. బారామతి నుంచి లోక్సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# హిండెన్‌బర్గ్ కుట్రకు కాంగ్రెస్ వత్తాసు

### బీజేపీ నేత గౌరవ్ వల్లభ్

**న్యూఢిల్లీ:** హిండెన్‌బర్గ్ లేటెస్ట్ రిపోర్ట్ రాజకీయ ప్రకంపనలకు కేంద్రబిం దువైంది. ఈ రిపోర్ట్ వెల్లడించిన అంశాలపై కాంగ్రెస్, బీజేపీ పరస్పర విమర్శలకు పదునుపెట్టాయి. అదానీ విదేశీ ఫండ్లలో సెబీ చీఫ్‌తో పాటు ఆమె భర్తకు వాటాలున్నాయని ఈ నివేదిక పేర్కొనడం పెను దుమారం రేపింది. సెబీ చీఫ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తుండగా ఇవి నిరాధార ఆరోపణ లని పాలక పక్షం దీటుగా బదులిస్తోంది. భారత మార్కెట్లు పతనం కావాలని కాంగ్రెస్, హిండెన్‌బర్గ్ కోరుకుంటున్నాయని బీజేపీ నేత గౌరవ్ వల్లభ్ ఆరోపించారు. విపక్షాలు, హిండెన్‌బర్గ్ ఆశలు ఫలించవని, దేశీయ స్టాక్‌మార్కెట్లు, కంపెనీలు పటిష్టంగా ఉన్నాయని అన్నారు. హిండెన్‌బర్గ్ నివేదికపై ఎంత గగ్గోలు పెట్టినా మార్కెట్ కేవలం 0.7 శాతమే పడిపోయిందని చెప్పారు. ప్రధాని మోదీని వ్యతిరేకించే క్రమంలో కాంగ్రెస్, రాహుల్ గాంధీ దేశ ఆర్థిక వృద్ధినీ వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. చైనా కమ్యూనిస్ట్ పార్టీతో కాంగ్రెస్ పార్టీ ఏం ఒప్పందం చేసుకుందో బయటపెట్టాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక వచ్చిన కొద్దిక్షణాల్లోనే కాంగ్రెస్ నేతలు ట్వీట్లు చేయడం ఎందుకు మొదలుపెట్టారని ప్రశ్నించారు. అదానీ షేర్లను షార్ట్ సెల్లింగ్ చేయడం ద్వారా రూ. 122 కోట్లు ఆర్జించినందుకు హిండెన్‌బర్గ్‌కు సెబీ షోకాజ్ నోటీస్ జారీ చేస్తే సమాధానం ఇచ్చేందుకు భయపడుతోందని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసి మధ్యతరగతి కలలను చిదిమేసే కుట్రకు తెరలేపారని ఆరోపించారు. సెబీ షోకాజ్ నోటీసుకు సమాధానం చెప్పకుండా మరో రీసెర్చి రిపోర్ట్‌ను రిలీజ్ చేశారని చెప్పారు.

# గోల్కొండ కోట మీదే పంద్రాగస్టు

- సీఎం హెూదాలో తొలిసారి త్రివర్ణ పతాకం ఎగురవేయనున్న రేవంత్
- ఏర్పాట్లు పర్యవేక్షించిన సీఎస్ శాంతి కుమారి



**హైదరాబాద్, ప్రజానావ:** పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంద్రాగస్టు వేడుకలను గోల్కొండ కోటపైనే ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి హెూదాలో రేవంత్‌రెడ్డి తొలిసారి గోల్కొండ కోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయనున్నారు. అనంతరం అక్కడి నుంచి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా, ప్రముఖులు గోల్కొండ కోటకు విచ్చేస్తున్నందున అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం గోల్కొండ కోటను పరిశీలించారు. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చి గోల్కొండలో ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. వర్షం కురిస్తే వేడుకలకు హాజరయ్యేవారు తడవకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. వీఐపీలు రానున్న నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు, పార్కింగ్ పై దృష్టి సారించాలని పోలీసు శాఖను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కాగా ఈ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. వేడుకల్లో గుస్సాడి, కొమ్ము కోయ, లంబాడీ, డప్పులు, ఒగ్గు డొల్లు, కోలాటం, బోనాలు కోలాటం, భైండ్ల జమిడికల్, చిందు యక్షగానం, కర్రసాము, కూచిపూడి, భరతనాట్యం, పేర్ని వంటి వివిధ కళారూపాలకు చెందిన వెయ్యి మందికి పైగా కళాకారులు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రదర్శనలు ఇస్తారన్నారు. ఆమె వెంట డీజీపీ జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కేటాయించాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు ప్రజా సంఘాల వినతి**

**సిరిసిల్ల, ప్రజానావ:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కులగణన చేపట్టి స్థానిక సంస్థల రిజర్వేషన్లను కేటాయించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ కుమార్, లంబాడ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్ నాయక్, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేశ్ మాట్లాడుతూ 30ఏళ్లుగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఒకే రకమైన రిజర్వేషన్లు కల్పిస్తూ ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో 50 నుంచి 60 శాతం ఓట్లు ఒకే సామాజిక వర్గం ఉన్నప్పటికీ.. ఆ వర్గానికి ఇంతవరకు రిజర్వేషన్లు కేటాయించక, అక్కడ జనరల్ రిజర్వేషన్ కేటాయింపులతో ఆర్థిక పలుకుబడి ఉన్న వ్యక్తులు ఆధిపత్యం చెలాయించారన్నారు. దీనివల్ల ఎస్సీ, ఎస్టీలకు రాజకీయంగా అందాల్సిన ఫలితాలు అందక వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం కుల గణన చేసి జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ లంతా ఏకమై ఐక్య ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సన్నీ, క్రాంతి, దినేష్, వంశీ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి బ్లాకుల వేలం ఆపండి

**భూపాలపల్లి జీఎం కార్యాలయం ఎదుట సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ధర్నా**

**భూపాలపల్లి, ప్రజానావ:** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తలపెట్టిన సింగరేణి బ్లాకులను వేలం వెంటనే ఉపసంహరించుకోవడంతో పాటు సింగరేణి బొగ్గు బ్లాకులు సింగరేణికే అప్పజెప్పాలని భూపాలపల్లి జీఎం కార్యాలయం ఎదుట ఆదివారం సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓపెన్ కాస్టుల పేరుతో జరుగుతున్న సాగు భూముల విధ్వంసాన్ని కూడా వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఇఫ్టూ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఐ. కృష్ణ, టీఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జీ. రాములు పాల్గొని సింగరేణి సమస్యలను ప్రస్తావించారు.

ఈ ధర్నాలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు సుదర్శన్, ఏ. వెంకన్న, చంద్రగిరి శంకర్, ఈ. నరేశ్, బీ. అశోక్, అలీ, నీరటి రాజన్న, కుమార స్వామి, దేవీ సత్యం, పోచమల్లు, జైపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రావణ సోమవారం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బ్రేక్ దర్శనం క్యూలైన్లను ఆలయ ఈఓ కె.వినోద్ రెడ్డి పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఆలయ రిసెప్షన్ ఏఈఓ రమేశ్ బాబు, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు రాజన్ బాబులను క్యూ లైన్లలో భక్తులకు ఎలాటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. వీరి వెంట ఆలయ సిబ్బందితో పాటు ఎస్పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

– వేములవాడ, ప్రజానావ

## మాజీ డీహెచ్ జి.శ్రీనివాస్ రావు వీఆర్ఎస్ ఆమోదం



**హైదరాబాద్, ప్రజానావ:** మాజీ హెల్త్ డైరెక్టర్ డా. గడల శ్రీనివాస్ రావు వీఆర్‌ఎస్‌ను ప్రభుత్వం ఆమోదించిం ది. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ డీహెచ్ గడల శ్రీనివాసరావును ప్రభుత్వం జులై 27న బదిలీ చేసిన విషయం తెలిసిందే. పబ్లిక్ హెల్త్ విభాగం లో జాయింట్ డైరెక్టర్ క్యాడర్‌లో ఉన్న ఆయనను మహబూబాబాద్ అడిషినల్ డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ (ఏడీపీహెచ్‌ఓ)గా నియమించింది. అయితే మాజీ డీహెచ్ జి.శ్రీనివాస్‌రావు వీఆర్‌ఎస్‌ను ఆమోదిస్తూ ఈ నెల 8న ఇచ్చిన ఉత్తర్వులు సోమవారం వెలుగులోకి వచ్చాయి.

## మావోల దుశ్చర్యకు మహిళ బలి



**చర్ల, ప్రజానావ:** చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా, కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలో డబ్బమార్క గ్రామానికి చెందిన సుక్కి అనే మహిళ మావోల దుశ్చర్యకు బలైంది. ఆదివారం ఆవులు మేపేందుకు ఆడవికి వెళ్లిన సుక్కి మావోయిస్టులు అమర్చిన ఐఈడీ బాంబు పేలి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ పేలుడు ధాటికి ఆ ప్రాంతం మొత్తం కలకలం రేగడంతో స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనను జిల్లా ఎస్పీ నిఖిల్ రఖేజా ధ్రువీకరించారు.

## పోలీసు స్టేషన్ ముందే చోరీ

**కారు అద్దాలు పగులగొట్టి రూ.10 లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు**



**జోగిపేట, ప్రజానావ:** సంగారెడ్డి జిల్లా జోగిపేట పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం భారీ చోరీ జరిగింది. జోగిపేటకు చెందిన రవీందర్‌రెడ్డి విద్యుత్ శాఖలో ఏడీగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. మధ్యాహ్న సమయంలో స్థానిక ఎస్‌బీఐలో రూ.10 లక్షలు డ్రా చేసుకొని తన కారు ముందు సీటులో పెట్టారు. స్వీట్లు కొనటానికి వెళ్లేందుకు పోలీస్ స్టేషన్ ముందు కారు నిలిపి రోడ్డు క్రాస్ చేశాడు. షాపులో స్వీటు తీసుకొని కారు వద్దకు వచ్చేలోపే గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులగొట్టి రూ.10 లక్షల బ్యాగ్ ఎత్తుకెళ్లారు. ఆయన వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం వివరించారు. సీఐ సంఘటన స్థలానికి వచ్చి పగిలిన కారు అద్దాలను పరిశీలించారు. వెంటనే బ్యాంక్‌కు వెళ్లి సీసీ ఫుటేజీని పరిశీలించారు. తన సిబ్బందితో గాలింపు చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాండు తెలిపారు.



## డ్రగ్స్, గంజాయి నివారణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

**అదనపు ఎస్పీ చంద్రయ్య**

**వేములవాడ, ప్రజానావ:** డ్రగ్స్, గంజాయి నివారణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని అదనపు ఎస్పీ చంద్రయ్య పిలుపునిచ్చారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలు సాధించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాశ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమనికి అదనపు ఎస్పీ హాజరై మాట్లాడారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమై భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దామని పిలుపునిచ్చారు. యవత, విద్యార్థులు మత్తు పదార్థాలు, గంజాయికి దూరంగా ఉంటూ భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్, ఎస్ఐ అంజయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

**వేములవాడ రూరల్ మండలంలో..**

వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి కేజీబీవీ పాఠశాల, వట్టెంల, నూకలమర్రి, చెక్కపల్లి, ఫాజల్ నగర్ పాఠశాలల్లో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు సోమవారం 'నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం' నిర్వహించినట్లు వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ విద్యార్థులతో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు.




## స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోండి

- ఉన్నత న్యాయస్థానంలో పిల్ దాఖలు చేసిన సామాజికవేత్త
- విచారణ చేపట్టిన హైకోర్టు
- పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** దివ్యాంగులపై స్మిత సబర్వాల్ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఉన్నత న్యాయస్థానంలో పిల్ దాఖలైంది. సామాజికవేత్త వసుంధర ఈ పిటిషన్ దాఖలు చేశారు. యూపీఎస్సీ చైర్మన్‌కు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో ఆమె తెలిపారు. ఈ పిటిషన్‌పై సోమవారం నాడు హైకోర్టు విచారణ చేపట్టింది. పిటిషనర్‌కు ఉన్న అర్హతను హైకోర్టు ప్రశ్నించింది. పిటిషనర్ ఒక వికలాంగురాలని అడ్వకేట్ తెలిపింది. పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.

### లంచం తీసుకుంటూ పట్టుబడిన ఇరిగేషన్ ఏఈ

**హన్మకొండ, ప్రజానావ:** గత ప్రభుత్వ సమయంలో అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులకు రిలీజ్ చేసేందుకు ఇరిగేషన్ అధికారి లంచం డిమాండ్ చేశాడు. సోమవారం హన్మకొండలోని నక్కలగుట్ట ఎస్‌బీఐ బ్యాంకు ప్రాంతంలో రూ. 6వేలు లంచం తీసుకుంటుండగా ఇరిగేషన్ ఏఈ గుగులోతు గోపాల్ ఏసీబీకి పట్టుబడ్డాడు. పాలకుర్తి మండలం గుడికుంట తండా గ్రామ మాజీ ఎంపీటీసీ బానోతు యాకు గతంలో చేసిన పనుల కోసం ఇరిగేషన్ ఏఈ గోపాల్ రూ.పదివేలు డిమాండ్ చేయగా, బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. అవినీతి నిరోధక శాఖ అధికారులు పక్కా ప్లాన్ ప్రకారం రూ. 6వేలు తీసుకుంటుండగా గోపాల్‌ను పట్టుకున్నారు. ఏఈ గోపాల్ ప్రస్తుతం గుడికుంట తండా గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.





## బండి.. జన్మభూమి రుణం తీర్చుకో

- దమ్ముంటే.. సమస్యల పరిష్కారం కోసం హర్ ఘర్ రోజ్ గార్ కార్యక్రమం చేపట్టు
- తెలంగాణ, కరీంనగర్ అభివృద్ధికి కృషి చేయాలి
- సంచలనాల కోసం కాంగ్రెస్ విమర్శించడం మానుకో
- కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు

**కరీంనగర్ బ్యూరో, ప్రజానావ:** కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ హర్ ఘర్ తిరంగా పండుగ జరిగే సమయంలోనే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి 'హర్ ఘర్ రోజ్ ఘర్' కార్యక్రమం చేపట్టాలని సవాల్ విసిరారు. సోమవారం ఆయన మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'నిన్ను గెలిపించిన జన్మభూమి కోసం ఏమైనా గొప్ప పని చెయ్యక ఊరికే నేను డబుల్ పక్కా లోకల్ అని డైలాగులు కొడితే లాభం లేదు' అని విమర్శించారు. ఊరికే ఊకదంపుడు ఉపన్యాసాలు మాని ప్రజల కోసం పనిచేయాలని హితవు పలికారు. దమ్ముంటే ప్రజా సమస్యల పరిష్కారానికి హర్ ఘర్ రోజ్ ఘర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు. ఒక బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించి స్వాతంత్ర దినోత్సవం రోజున కరీంనగర్ ప్రజలు జెండా ఆవిష్కరణతో పాటు నీ ఫొటోకు పాలాభిషేకం చేయించుకునేలా చూడాలన్నారు. దేశ సమైక్యత సమగ్రత దేశభక్తి పెంపొందించడం కోసం ప్రతి ఒక్కరూ జెండా ఎగురవేయడం తమ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ మహనీయులను స్మరించుకోవడం ప్రతి ఇంటా జెండా ఎగరవేయడం మన లక్ష్యమని పేర్కొన్నారు. మొదటిసారి ఎంపీగా గెలిచి కరీంనగర్ ఏమి చేయలేకపోయారని, రెండోసారి ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి అయ్యారని పేర్కొన్నారు. కనీసం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే లక్ష్యంతో ముందుకెళ్లాలని సూచించారు. కేంద్ర మంత్రి పదవిలో ఉన్నందున బండి సంజయ్ కుమార్ కరీంనగర్‌కు పేరు తీసుకొచ్చే విధంగా మెలగాలని, సంచలనాల కోసం కాంగ్రెస్‌ను విమర్శించడం పనిగా పెట్టుకోవద్దన్నారు. మీకు దమ్ముంటే తెలంగాణతో పాటు కరీంనగర్ అభివృద్ధికి కృషి చేసి జన్మభూమి రుణం తీర్చుకోవాలని డిమాండ్ చేశారు.



# ఎనిమిది నెలల్లో 36 మంది మృతి

- 500 మందికి అస్వస్థత
- హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలపై ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణ ఉండాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఇటీవల పాముకాటుకు గురై మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి పరామర్శ

**ఎల్లారెడ్డిపేట, ప్రజానావ:** సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల మరణాలు తల్లిదండ్రులకు కడుపు కోతను మిగిలిస్తున్నాయని, ఎనిమిది నెలల్లోనే 36మంది మృతి చెందగా, 500 మందికిపైగా అస్వస్థతకు గురయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. సిరిసిల్ల జిల్లా పెద్దాపూర్ గురుకులంలో మూడు రోజుల క్రితం పాముకాటుకు గురై మృతి చెందిన ఆరో తరగతి విద్యార్థి అనిరుధ్ కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన వివరాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ పెద్దాపూర్ గురుకులంలో సంరక్షణ చర్యలను గాలికి వదిలి వేయడంతోనే ఇద్దరువిద్యార్థులు మృత్యువాత పడగా, మరో విద్యార్థి చికిత్స పొందుతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్ని దుర్ఘటనలు జరిగిప్పటికీ పాలకులు, ప్రభుత్వానికి కనువిప్పు కలగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో విద్యార్థుల బాగోగులు, సమస్యలనపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలపై ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. రాజకీయ కోణంలో కాకుండా సీఎం మానవతా దృక్పథంతో చూసి సమన్వయంతో పనిచేసి విద్యార్థుల మరణాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. విద్యార్థి అనిరుధ్ కుటుంబానికి తమ వంతు తోడ్పాటును అందిస్తామని తెలిపారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విషపురుగుల కాటుకు, కల్తీ ఆహారం తిని మరణించిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ గుండాడి కృష్ణారెడ్డి, నాయకులు పిల్లి కిషన్, లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహులు తదితరలున్నారు.

# చెరువుల పరిరక్షణలో ఎవరిమాట వినం

- రాజకీయ పలుకుబడిని అసలే పట్టించుకోం
- చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లపై విస్తృత ప్రచారం
- ఎన్ఓసీలు, అనుమతులు జారీచేసినా చట్టపరంగా చర్యలు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్
- త్వరలోనే హైడ్రా పోలీస్ స్టేషన్.. 72 బృందాలు అవసరం



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ :** చెరువులను కాపాడుకుందాం, చెరువులను పునరుద్ధరిద్దాం, చెరువుకు చెరువులకు మధ్య లింకులను ఏర్పాటు చేద్దామని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) కమిషనర్ ఏవీ రంగనాథ్ పిలుపునిచ్చారు. చెరువుల బఫర్ జోన్లు, ఎఫ్‌టిఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టే ప్రయత్నం చేస్తే చట్టపరమైన కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు. సోమవారం హైడ్రా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రంగనాథ్ మాట్లాడుతూ చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ల పరిధిలో అనుమతులు మంజూరు చేసినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చందానగర్ ఈర్ల చెరువు బఫర్ జోన్‌లో బిల్డింగ్ అనుమతి మంజూరు చేశారనీ, ఓసి(ఆక్యుపెన్సీ సర్టిఫికేట్) కూడా జారీ చేశారనీ అయినా హైడ్రా వెళ్లి అనుమతులు నియమావళికి విరుద్ధంగా బఫర్ జోన్‌లో ఉన్నాయని చర్యలు తీసుకోవడం జరిగిందని, ఈ తరహా నిర్మాణాలను కూడా ఉపేక్షించమని రంగనాథ్ హెచ్చరించారు.

### దశల వారీగా ముందుకు

ఔటర్ రింగ్ రోడ్‌లోపలి వైపుల 455 చెరువులు ఉన్నాయని, వీటి ఆక్రమణలపై నిరంతరం ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయనీ, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, విచారించి, అధికారులతో చర్చించిన అనంతరం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. మొదటిదశలో చెరువుల్లోకి ఆక్రమణలు రాకుండా నివారించడం, రెండోదశలో చెరువుల్లో ఉన్న నిర్మాణాలు, కబ్జాలు, ఘన వ్యర్థాల పూడికను తొలగించడం, మూడోదశలో చెరువుల పునరుద్ధరణ తగిన ప్రణాళికలతో చేపట్టడం ఉంటుందన్నారు. ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లలో ఎన్ఓసిలు ఉన్నా, నిర్మాణ అనుమతులు పొందినా వాటిని రద్దు పరిచే విధంగా ఆయా విభాగాలకు సూచించడం, వాటిని జారీచేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో వెనుకాడేది లేదని ఆయన స్పష్టం చేశారు.

### త్వరలోనే పోలీస్‌స్టేషన్

హైడ్రాను మూడు డివిజన్లుగా ఏర్పాటు చేయాలనే యోచనతో ఉన్నామనీ, ముందుగా ఒక ఏసిపి స్థాయి అధికారితో ఓ హైడ్రా పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో 6 టీంలు మాత్ర మే ఉన్నాయని, అయితే, హైడ్రాకు 72 బృందాలు అవసరమని సూచన ప్రాయంగా తెలిపారు. అసెట్స్ ప్రొటెక్షన్ విభాగం ప్లానింగ్ విభాగంతో, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ట్రాఫిక్ పోలీసుతో సమన్వయం ఉంటుందనీ పేర్కొన్నారు. చెరువులతో పాటు నాలాలు, వరద కాలువలను కాపాడు కోవాల్సిన అవసరం ఉందన్నారు. నాలాలు కబ్జాలపైనా చర్యలు ఉంటాయనీ, అయితే, ముందుగా చెరువుల సమ స్యలను తీసుకుని ఆ దిశగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఎన్ఆర్ఎస్‌సి అందించిన సమాచారం ప్రకారం గా చెరువులు 60-80 శాతం వరకు చెరువులు ఆక్రమణలకు, పూడ్చివేయడం జరిగిందని చెప్పారు. చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లపై విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు.

### బిల్డర్లపై చట్టపరమైన కేసులు పెడతాం

చెరువుల పరిధిలో లేఅవుట్లు వేసి ప్లాట్లను, ప్లాట్లలో నిర్మాణాలు చేపట్టే బిల్డర్లపై చట్టపరంగా కేసులు పెడతామని రంగనాథ్ హెచ్చరించారు. కొనుగోలుదారులు కూడా నిర్మాణాలను, ప్లాట్లను ఖరీదు చేసే సమయంలో వాటికి అధికారిక అనుమతులు ఉన్నాయా ? లేదా పరిశీలించి అన్నీ అనుమతులు ఉన్నాయనీ, చట్టపరంగా చెల్లుబాటు అవుతుందని నిర్ధారించుకున్నాకే కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. డెబ్రిస్, గార్బేజీలను చెరువుల్లో వేసే వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని వెల్లడించారు. చెరువులు, వరద కాలువలు, నాలాలను ఆక్రమించుకోవాలంటే జంకే పరిస్థితిని కల్పిస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం చెరువుల సర్వే జరుగుతుందనీ, పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ ఉన్నా ఉపేక్షించేది లేదని రంగనాథ్ స్పష్టం చేశారు.

# ఏపీలో క్వార్టర్ మద్యం బాటిల్ దర రూ.80?



**అమరావతి, ప్రజానావ:** గతంలో అస్తవ్యస్త మద్యం విధానం అమల్లో ఉండడంతో ఆంధ్ర ప్రదేశ్ మందుబా బులు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి మరి మద్యం సేవించే వారు. ఇప్పుడు కూ టమి ప్రభుత్వం రావడంతో మద్యం విధానం లో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. త్వరలోనే కొత్త మద్యం విధానం తీసుకురానున్నారు. ఆ మద్యం విధానం ద్వారా అతి తక్కువ ధరకే మద్యం అందుబాటులోకి రానుందని సమాచారం. బిర్యానీ కన్నా తక్కువ ధరకే మద్యం లభిస్తుందనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో క్వార్టర్ సీసా కేవలం రూ. 80 నుంచి 90 లోపే ధర నిర్ణయించాలని ఏపీ ఎక్సైజ్ శాఖ నిర్ణయించినట్లు సమాచారం. ఇకపై ఏపీ మందు బాబులు పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు.

# ఎమ్మెల్యే దానంపై కేసు

### ప్రహరీ కూల్చివేత వివాదం



**ఖైరతాబాద్, ప్రజానావ:** గురుబ్రహ్మనగర్ స్థల వివాదంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఈ నెల 10న నందగిరి హిల్స్ పరిధిలోని గురుబ్రహ్మనగర్లోని ప్రభుత్వ స్థలానికి అధికారులు ప్రహరీ కడుతుండగా, అక్కడ నివాసం ఉంటున్న గిరిజనులు అడ్డుకున్నారు. వారందరూ ఎమ్మెల్యే దానంకు ఫిర్యాదు చేయడంతో, ఆ ప్రహరీని ఎమ్మెల్యే తొలగించారు. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి వి. పాపయ్య, ఎమ్మెల్యే దానంపై జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూ.10 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మించి ప్రభుత్వస్థలాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తే, ఎమ్మెల్యే సమక్షంలోనే కొందరు ప్రహరీని ధ్వంసం చేశారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యేతో పాటు వారిలో గోపాల్ నాయక్, రాంచందర్ ఉన్నారని పేర్కొన్నారు.

# డివైడర్‌ను ఢీకొన్న బైక్

### ముగ్గురు యువకులు మృతి

**హైదరాబాద్, ప్రజానావ:** బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతి చెందిన సంఘటన పాతబస్తీ బండ్లగూడలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సైదాబాద్ శంకేశ్వర్ బజార్‌కు చెందిన బ్యాగరి శ్రీహరి (28), సందీప్ (20) , అభిలాష్ (20) స్నేహితులు. ముగ్గురు స్నేహితులు సోమవారం సైదాబాద్‌లో బోనాల పండుగ కావడంతో ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్లారు. ఈ క్రమంలోనే అభిలాష్ సోదరి ఫోన్ చేసి ఇంటికి రావాలని చెప్పింది. దీంతో అభిలాష్‌ను మైలార్‌దేవ్‌పల్లిలో ఉండే అతడి సోదరి ఇంటి వద్ద వదిలిపెట్టేందుకు ముగ్గురు బైక్‌పై వస్తున్నారు. చాంద్రాయణగుట్ట మీదుగా మైలార్‌దేవ్‌పల్లికి వస్తుండగా హాషమాబాద్ వద్ద స్పీడ్‌గా ఉన్న బైక్ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న శ్రీహరి, సందీప్, అభిలాష్‌లు ముగ్గురు బైక్‌పై నుంచి 20 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డారు. ముగ్గురి తలకు తీవ్ర గాయాలు కావడంతో సందీప్, అభిలాష్ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన శ్రీహరిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంపై బండ్లగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# సాగర్ గేట్లు మూసివేత

### తగ్గిన వరద ప్రవాహం

**నాగార్జునసాగర్, ప్రజానావ:** నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో సోమవారం మధ్యాహ్నం ఎన్ఎస్‌పీ అధికారులు క్రస్ట్‌గేట్లను మూసివేశారు. ఆదివారం వరకు పర్యాటకులతో కిటకిటలాడిన నాగార్జునసాగర్ సోమవారం ఉదయం నుంచి బోసిపోయింది. సోమవారం ఉదయం శ్రీశైలం డ్యామ్ గేట్లు మూసివేయడంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం తగ్గింది. దీంతో మధ్యాహ్నం నుంచి అధికారులు డ్యాం గేట్లను మూసేశారు. గత నెల రోజుల నుంచి భారీ వర్షాలు కురవడంతో నాగార్జునసాగర్ డ్యాం పైన ఉన్న అన్ని ప్రాజెక్టులు నిండడంతో భారీగా వరద ప్రవాహం రావడంతో గత సోమవారం నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టు డ్యాం గేట్లు తెరిచి నీటిని దిగువకు విడుదల చేశారు.

వారం రోజులుగా నాగార్జున సాగర్ డ్యాం నుంచి దాదాపు 173 టీఎంసీల నీటిని దిగువ కు విడుదల చేసినట్లు ఎన్ఎస్‌పీ అధికారులు తెలిపారు. సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 308.4658 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# 'ధరణి'తో రైతులు వందలాది ఎకరాలు కోల్పోయారు

### కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి



**బచ్చన్నపేట, ప్రజానావ:** గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణితో రాష్ట్రంలో వందలాది మంది పేద రైతులు భూములను కోల్పోయారని, అలాంటి సమస్యలు పునరావృతం కాకుండా, భూ సమస్యలు ఉండకూడదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక ధరణి కమిటీని నియమించారని కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు కోదండ రెడ్డి తెలిపారు. సోమవారం జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం బండనాగారం గ్రామానికి చెందిన రైతుల భూసమస్యలు సిద్దిపేట జిల్లా, మద్దూరు మండలం, మర్మాముల శివారులో ఉండడంతో ఆ సమస్యలను తెలుసుకోవడానికి ఆయన గ్రామానికి వచ్చారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బండనాగారం, బంజేరు గ్రామాల రైతులు దాదాపు 30 మందికి 45 ఎకరాల మేర భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు అందలేదన్నారు. ఈ గ్రామంలో ఓ వ్యక్తి ఆ భూమిని మొత్తం పట్టా చేసుకొని ఈ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అన్నారు. భూమి పట్టా లేక ఆ రైతులకు రైతు భరోసా, రైతు బీమా వర్తించడం లేదని అన్నారు. బ్యాంకులలో పంటల రుణాలను తీసుకోవడానికి కూడా ఈ రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. త్వరలోనే ఆర్ఆర్- 2024 చట్టలను తీసుకురాబోతున్నామని, అప్పుడు ఈ రైతులు దరఖాస్తు చేసుకొని పట్టాలను పొందవచ్చునని సూచించారు. ఈ విషయాన్ని రెవెన్యూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మాట్లాడి, అవసరమైతే సీఎం దృష్టికి కూడా తీసుకుపోతానన్నారు. ఈ ప్రాంత రైతులకు ఏ భూ సమస్యలు ఉన్నా సంప్రదించాలని, అవసరమైతే ధరణిలో మార్పులు చేర్పులు చేయడానికి సలహాలను కూడా ఇవ్వాలని తెలిపారు. ఆయన వెంట కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి నారాయణరెడ్డి, రైతులు జంగిలి యాదగిరి అంజనేయులు, సాయిబాబ, స్వామి. తిరుపతి, ఉప్పలయ్య తదితరులున్నారు.



### భార్యను కాపురానికి పంపడం లేదంటూ

# అత్త, మామపై అల్లుడి దాడి

### మామ మృతి, అత్త పరిస్థితి విషమం

**మంగపేట, ప్రజానావ:** భార్యను కాపురానికి పంపడం లేదని అత్త, మామలపై అల్లుడు కర్రతో దాడి చేయడంతో మామ మృతి చెందగా, అత్త పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ములుగు జిల్లా మంగపేట మండలం బాలన్నగూడెం పంచాయతీ పరిధిలోని నీలాద్రిపేటలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఏటూరు నాగారం సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నీలాద్రిపేటకు చెందిన దంపతులు గొర్రె రాజ నర్సయ్య (56) నర్సమ్మకు ముగ్గురు కుమార్తెలు. రెండో కూతురు స్వప్నను అదే గ్రామానికి చెందిన గాంధర్ల రామకృష్ణకు ఇచ్చి 17 ఏళ్ల క్రితం వివాహం చేశారు. రామకృష్ణ నాలుగేళ్లుగా అదే గ్రామానికి చెందిన మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడంటూ స్వప్న భర్తను అనుమానించి తల్లిదండ్రుల వద్ద ఉంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం స్వప్న కిరాణా షాపునకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రామకృష్ణ తనతో ఎందుకు మాట్లాడటం లేదని మందలించగా సమాధానం చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె వెనకాలే వెళ్లిన భర్తను చూసి అత్త, మామలు రామకృష్ణను మందలించడంతో ఆగ్రహానికి గురైన రామకృష్ణ అక్కడే ఉన్న కర్రతో మామపై దాడి చేయగా తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. అత్త నర్సమ్మ వారించే క్రమంలో ఆమెను కూడా చంపుతానంటూ దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు వారిని ఎంజీఎం ఆసుపత్రికి తరలించే క్రమంలో రాజనర్సయ్య మార్గ మధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏటూరు నాగారం ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ, సీఐ అనుముల శ్రీనివాస్‌తో కలిసి సోమవారం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలు నర్సమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం నర్సమ్మను వరంగల్‌కు తరలించామని తెలిపారు. మృతుడి చిన్న కూతురు సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.





# రజనీకాంత్‌తో నటించడం అంటే.. జ్వరం వచ్చేసింది

## వేట్టయ్యన్ హీరోయిన్ దుషార విజయన్

సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా దర్శకుడు టీజే జ్ఞానవేల్ రూపొందిస్తున్న 'వేట్టయ్యన్'లో యువ నటి దుషార విజయన్ ఛాన్స్ దక్కించుకుంది. ఇటీవలే సినిమాలో తన పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకోగా డబ్బింగ్ కూడా పూర్తి చేసింది. ఈ అవకాశంపై ఆమె స్పందించింది. తాజాగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ అ షూటింగ్ సమయంలో జరిగిన తన అనుభవాలను పంచుకుంది. 'వేట్టయ్యన్' చిత్రంలో తలైవర్‌తో కలిసి నటించాననే గర్వంతో పాటు భయం ఏర్పడింది. షూటింగ్‌కు ముందు రోజు ఏకంగా జ్వరమే వచ్చింది. ఆయనతో కలిసి నటించే సమయంలో ఒక వైపు జ్వరం, మరోవైపు ముచ్చెమటలు పట్టాయని తెలిపింది. పట్టరాని సంతోషం.. మరోవైపు భయం, ఆందోళన. ఈ రెండింటిని ఏక కాలంలో అనుభవించాను. అలాంటి మానసికస్థితిలో రజనీతో కలిసి నటించాను. ఇది ఒక కలగానే ఉంది. అలాగే, ఫహద్ ఫాజిల్‌తో కలిసి 'వేట్టయ్యన్' కోసం కలిసి చేయడం కూడా గొప్ప అనుభూతిగా ఫీలవుతున్నాను. అందుకే 'రాయన్' తరహాలోనే 'వేట్టయ్యన్' మూవీ కూడా నా కెరీర్‌లో నిలిచిపోతుంది' అని పేర్కొన్నారు. 'బోధై ఏరి బుద్ధి మారి' చిత్రం ద్వారా 2019లో చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టింది నటి దుషారా విజయన్. ఆ తరువాత పా.రంజిత్ దర్శకత్వం వహించిన 'సార్పట్టా పరంబరై' చిత్రంతో నటిగా మంచి పేరు తెచ్చుకోవడంతో అవకాశాలు వరుస కట్టాయి.



# నేను సింగిల్ కాదు..

## కీర్తి సురేష్

ప్రస్తుతం బాలీవుడ్ ఇండస్ట్రీలో బిజీగా దూసుకుపోతుంది హీరోయిన్ కీర్తి సురేష్. సౌత్ అడియన్స్ హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ కెరీర్ ఆరంభంలో ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నానని అన్నారు. తాను నటించిన లు బాక్సాఫీస్ వద్ద పరాజయం పొందాయని అన్నారు. ఇటీవల ఓ పాడ్ కాస్ట్ లో పాల్గొన్న కీర్తి సురేష్ మాట్లాడుతూ.. కెరీర్ ప్రారంభంలో ఎదురైన విమర్శలు.. ప్రేమ, పెళ్లి గురించి వచ్చిన రూమర్స్ పై స్పందించారు. తన లు బాక్సాఫీస్ వద్ద పరాజయం కావడంతో తనను చాలా మంది విమర్శించారని.. దీంతో మానసికంగా చాలా బాధపడ్డానని అన్నారు. మనసుకు నచ్చిన చిత్రాల్లో నటిస్తున్నానని.. కానీ తన లు ప్లాప్ కావడంతో చాలా ట్రోల్స్ ఎదుర్కొన్నానని.. సౌత్ ఇండస్ట్రీలో అత్యధిక ట్రోల్స్ ఎదుర్కొన్న హీరోయిన్ తనే అని.. కానీ మహానటి తర్వాత ట్రోల్స్ తగ్గాయని అన్నారు. విమర్శలను స్వాగతిస్తానని.. అనేక విషయాలను నేర్చుకుంటానని అన్నారు. కొంతమంది కావాలని తన పై నెగిటివ్ కామెంట్స్ చేస్తుంటారని.. అందుకే వాటిని అంతగా పట్టించుకోనని.. రియాక్ట్ కానని అన్నారు. కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందని భావిస్తున్నానని అన్నారు. ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు గౌరవం ఇచ్చుకుంటూ జీవితాన్ని కొనసాగించడమే పెళ్లి అని తన భావన అని అన్నారు. దీంతో ఓ విలేకరి మాట్లాడుతూ.. మీరు సింగిల్ గా ఉంటున్నారు. బోర్ గా అనిపించడం లేదా ? అని ప్రశ్నించగా.. సింగిల్ అని నేను చెప్పలేదుగా అని బదులిచ్చారు. ప్రస్తుతం కీర్తి కామెంట్స్ నెట్టింట వైరలవుతున్నాయి.

# లిప్ లాక్ సీన్స్ వల్ల చాలా అవకాశాలు కోల్పోయాను

## మృణాల్ ఠాకూర్ షాకింగ్ కామెంట్స్..

సీతారామం తో తెలుగు అడియన్స్ హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది హీరోయిన్ మృణాల్ ఠాకూర్. తొలి చిత్రంతోనే కథానాయికగా ప్రశంసలు అందుకున్న మృణాల్ ఆ తర్వాత మాత్రం తెలుగులో వరుస ఆఫర్స్ అందుకుంటూ స్టార్ డమ్ సొంతం చేసుకుంది. మొదట్లో బుల్లితెరపై పలు సీరియల్స్ చేసిన ఈ బెంగాలీ బ్యూటీ.. ఆ తర్వాత మాతృభాషతోపాటు హిందీలో పలు ల్లో నటించింది. సీతారామం తో తెలుగు అడియన్స్ హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది హీరోయిన్ మృణాల్ ఠాకూర్. తొలి చిత్రంతోనే కథానాయికగా ప్రశంసలు అందుకున్న మృణాల్ ఆ తర్వాత మాత్రం తెలుగులో వరుస ఆఫర్స్ అందుకుంటూ స్టార్ డమ్ సొంతం చేసుకుంది. మొదట్లో బుల్లితెరపై పలు సీరియల్స్ చేసిన ఈ బెంగాలీ బ్యూటీ.. ఆ తర్వాత మాతృభాషతోపాటు హిందీలో పలు ల్లో నటించింది. హిందీలో సూపర్ 30, జెర్సీ చిత్రాల్లో నటించింది. తెలుగులో సీతారామం తో సీతామహాలక్ష్మీ పాత్రతో మరింత దగ్గరయ్యింది. ఈ మూవీ తర్వాత హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ చిత్రాలతో సూపర్ హిట్స్ అందుకుంది. కానీ ఆతర్వాత తెలుగులో మృణాల్ కు అవకాశాలు తగ్గిపోయాయి. ఇటీవలే తమిళంలో హీరో శివకార్తికేయన్ కు జంటగా నటించే అవకాశం కూడా చేజార్చుకుందనే ప్రచారం జరిగింది. అయితే ఇప్పటివరకు హోమ్లీ పాత్రలతో ప్రేక్షకులకు దగ్గరైన మృణాల్, కెరీర్ మొదట్లో లిప్ లాక్ సన్నివేశాల్లో నటించి తల్లిదండ్రులకు షాకిచ్చిందట. అలాంటి సన్నివేశాల్లో నటించడాన్ని మృణాల్ ఠాకూర్ తల్లిదండ్రులు తీవ్రంగా వ్యతిరేకించారట. దీంతో లిప్ లాక్ సన్నివేశాల్లో నటించకూడదని అనుకున్నారట. దీంతో పలు అవకాశాలను కోల్పోయానని అన్నారు. ఆ తర్వాత తల్లిదండ్రులను ఒప్పించి ముద్దు సన్నివేశాల్లో నటించడం తనకు అవసరమని తెలిపిందట.

# షేక్ హసీనాకు ఆశ్రయం సరైనదే

## కేంద్ర నిర్ణయాన్ని సమర్థించిన శశిథరూర్



**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్‌లో హింసాత్మక నిరసనల నేపథ్యంలో ప్రధానమంత్రి పదవికి షేక్ హసీనా రాజీనామా చేసి.. పారిపోయి వచ్చి భారత్‌లో ఆశ్రయం పొందు తుండడంపై కాంగ్రెస్ సీనియర్, ఎంపీ శశిథరూర్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. షేక్ హసీనాకు ఆశ్రయం ఇచ్చిన కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశంసించారు. ' మనం షేక్ హసీనాకు సాయం చేయకపోతే అది భారతదేశానికే అవమానం అయ్యేది. స్నేహితుడితో మనం చెడుగా ప్రవర్తిస్తే ఎవరూ మనకు మిత్రులు కావాలని కోరుకోరు. షేక్ హసీనా భారతదేశానికి స్నేహితురాలు. భారత్ ఆమెకు సన్నిహితురాలు. స్నేహితుడు ఇబ్బందుల్లో ఉన్నాడంటే సాయం చేయడానికి ఒకటికి రెండు సార్లు ఆలోచించకూడదు. భారత ప్రభుత్వం చేసిన పనిని నేను ఒక భారతీయుడిగా అభినందిస్తున్నాను. ఆమెకు భద్రత కల్పించి ఇక్కడికి తీసుకురావడానికి, ఇచ్ఛాక భద్రత కల్పిస్తూ భారత్ సరైన పని చేసింది' అని శశిథరూర్ వ్యాఖ్యానించారు. ఇక పొరుగు దేశంలో అధికార మార్పిడి భారత్‌కు ఏమాత్రం ఆందోళన కలిగించబోదని ఆయన అన్నారు. ఈ మేరకు ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లోని పరిణామాలు భారత్‌తో ఆ దేశ సంబంధాలను ఏవిధంగా ప్రభావితం చేస్తాయని ప్రశ్నించగా.. బంగ్లాదేశ్‌తో భారత్‌కు సహజ సిద్ధమైన స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని అన్నారు. బంగ్లాదేశ్ ప్రజల శ్రేయస్సు భారత్ తొలి లక్ష్యం అని అన్నారు. ప్రాధాన్యత పరంగా చూస్తే దేశం రెండవ స్థానంలో, ఏ రాజకీయ వ్యక్తి అయినా మూడవ స్థానంలో ఉంటారని చెప్పారు. 'మనం ఎలప్పుడూ బంగ్లాదేశ్ ప్రజలతో ఉన్నాం. 1971 యుద్ధం సమయంలో వారితోనే ఉన్నాం. బంగ్లాదేశ్ ప్రజలు కష్ట, సుఖాల్లోనూ వారి వెంటే ఉన్నాం. అక్కడ ఏ ప్రభుత్వం ఉన్నా భారత్‌తో స్నేహపూర్వకంగానే ఉన్నారు. భారత్ కూడా ఆ సంబంధాన్ని మరింతగా దృఢంగా కొనసాగించింది. రాబోయే కాలంలో ఇరు దేశాల మధ్య బంధంలో ఎలాంటి తగ్గుదల ఉండకూడదు' అని శశిథరూర్ అభిలాషించారు. ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్‌లో ఏర్పడిన మధ్యంతర ప్రభుత్వం విషయంలో భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శశిథరూర్ వ్యాఖ్యానించారు. వ్యక్తిగతంగా మహమ్మద్ యూనస్ తనకు తెలుసునని, అతను అత్యంత గౌరవనీయ-ంమైన వ్యక్తి అని మెచ్చుకున్నారు. జమాతే ఇస్లామి లేదా పాకిస్తానీ ఐఎస్ఐ కంటే.. అమెరికాకే ఎక్కువ దగ్గరగా ఉన్నారని భావిస్తున్నట్టు చెప్పారు. ఇక బంగ్లాదేశ్‌లో బలమైన ఉనికి ఉన్న చైనీయులు ఈ పరిణామంతో మరింత విస్తరించడానికి ఒక అవకాశంగా భావించవచ్చునని విశ్లేషించారు. ఇక మధ్యంతర ప్రభుత్వ కూర్పు ఎలాంటి ఆందోళనలు లేవని అన్నారు. దేశం శాంతి, మైనారిటీల రక్షణ కోసం తాత్కాలిక ప్రభుత్వ అధినేత చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# గిరిజన నేతలపై కక్షసాధింపులు

## ఇక పోరాటమే శరణ్యమన్న సోరేన్ !



**రాంచీ:** జైలునుంచి విడుదలయిన సందర్భంగా తన చేతిపై వేసిన జైలు ముద్రను చూపిస్తూ..ఇటీవల జార్ఖండా సిఎం హేమంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివాసీ, దళిత నేతలపై మోడీ ప్రభుత్వం కక్షగట్టిందన్నారు. ఇక తన పోరాటం దీనికి వ్యతిరేకంగానే సాగుతుందని అన్నారు. దేశంలో దళితులు, గిరిజనులు అధికారానికి దూరంగా ఉండేలా చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో నిజాయితీ ఉండాల్సిందే. అవినీతికి పాల్పడే నేతలను దునుమాడాల్సిందే. అందుకు ఎవరు కూడా మినహాయింపు కారాదు. అయితే జార్ఖండ్ సిఎం హేమంత్ సోరేన్‌ను వేటాడి వెంటాడి ఇడి వేధించిన తీరు కళ్లకు కనబడుతున్న వేధింపు చర్యగానే చూడాలి. గిరిజన నేత కావడంతో దిక్కులేని పక్షిలా ఉన్నాడు. అదే ఎన్‌డిఎ గూటికి చేరివుంటే సోరేన్‌కు ఈ కష్టాలు తప్పేవి. తెలుగు రాష్ట్రాల్లో అవినీతి ముఖ్యమంత్రులను మాత్రం ఏమీ చేయలేకపోయారు. ఇక్కడ వీరిని ట్రంప్ కార్డుల్లా వాడుకుంటున్నారు. రేపు ఏ అవసరం వస్తుందో అన్న భయంలో కాపాడుకుంటూ వచ్చారు. అయితే అవినీతి, అహంకారానికి పాల్పడిన కెసిఆర్ కుటుంబంపై రంకెలు వేసిన ప్రధాని మోడీ ఆయనపై ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు. అందుకే ప్రజలు తీర్పు ఇచ్చి వారిని అధికారానికి దూరం చేశారు. అలాగే ఎపిలో కూడా జగన్ బెయిల్‌పై ఉన్నా పట్టించుకోలేదు. కేసులు ఏవీ ఆయనను ఏమీ చేయడంలేదు. ఇదంతా మోడీ ప్రాపకం వల్లనే అని చెప్పాల్సిన అవసరం లేదు. కానీ జార్ఖండ్‌లో మాత్రం హేమంత్ సోరెన్ ప్రభుత్వం బలైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి)ని ప్రయోగించి ఏకంగా ముఖ్యమంత్రి నే అరెస్టు చేయించింది. జార్ఖండ్‌ను తీవ్ర అస్థిరతలోకి నెట్టింది. ఈడీ అధికారుల చర్యల కారణంగా తాను, తన కుటుంబం బాధపడ్డామనీ, తీవ్రమైన మనో వేదనను ఎదుర్కొన్నామనీ, తెలిపారు. ఓ గిరిజన ముఖ్యమంత్రికి ఇంతటి అవమానం జరుగుతుందని అనుకోలేదు. గతంలో అసోం సిఎం హిమంత్ బిశ్వ శర్మ కూడా ఇలాగే ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బిజెపిలో చేరాక అవినీతి కేసులు మాయమయ్యాయి. భూకుంభకోణానికి సంబంధించి విచారించటం కోసం హేమంత్‌కు ఈడీ గతంలో అనేక సార్లు సమన్లు పంపింది. దాదాపు తొమ్మిది సార్లు హేమంత్ ఈడీ సమన్లను విస్మరించారు. నిజానికి కుంభకోణాలకు, అవినీతికి పాల్పడ్డ వారు ఎంతటి వారైనా శిఓకు గురి కావాల్సిందే. కానీ జార్ఖండ్ మాత్రమే టార్గెట్ కావడం...కేవలం ఎన్‌డిఎ గుప్పిట లేకపోవడమే. తెలుగు రాష్ట్రాలకు ఓ న్యాయం జార్ఖండ్‌కు మరో న్యాయం సరికాదు. అసలు రాష్ట్రాల్లో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోవాల్సిందే. అప్పులకుప్పగా చేసి, దివాళా తీయించిన తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్ విషయంలో మోడీ ప్రేమ చూపడం సరికాదు. ఢిల్లీ మద్యం స్కామ్‌లో ఉన్న వారినెవరినీ వదలబోమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణలో జరిగిన ఎన్నికల సభల్లో ప్రకటించారు. లిక్కర్ స్కాంలో ఫోన్లు మార్చి డబ్బు తీసుకున్న బీఆర్ఎస్ నేతలు కూడా జైలుకు వెళ్లే సమయం తప్పకుండా వస్తుందని హెచ్చరించినా చర్యలు మాత్రం తీసుకోలేదు. ఈ దేశంలో ఎవరైనా నేరం చేస్తే శిక్ష పడేలా చేసే హక్కు న్యాయస్థానాలకే కాని ప్రభుత్వాలకు ఉండదు. ఢిల్లీ మద్యం స్కామ్ ఇప్పటికే సుప్రీం కోర్టు విచారణలో ఉన్నది. మనీలాండరింగ్ చట్టాన్ని నిర్విచక్షణగా అమలు చేయడం పట్ల సుప్రీంకోర్టు ఇప్పటికే అనేక అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అయినప్పటికీ ప్రధానమంత్రి స్వయంగా తాను రాజకీయ ప్రత్యర్థులను శిక్షిస్తానని బహిరంగ సభల్లో ప్రకటించారు. హేమంత్ సోరేన్ చివరకు న్యాయ పోరాటం ద్వారా బెయి-ంల్ తెచ్చుకున్నారు. జగన్, కెసిఆర్‌లతో పోలిస్తే హేమంత్ చేసిన నేరాలు పెద్దవేమీ కాదు. కఇదంతా కేవలం రాజకీయ దుర్బుద్ధితో చేసిందని హేమంత్ తాజాగా ఆరోపించారు. దీనిని రాజకీయంగానే పోరాడుతామని అన్నారు.

# రాహుల్ ప్రమాదకర వ్యక్తి

## సినీ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్



**న్యూఢిల్లీ:** 'రాహుల్ గాంధీ చాలా ప్రమాదకరమైన వ్యక్తి. అంటూ..సినీ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. సెబీ ఛైర్‌పర్సన్ మాధవీ పురి బచ్‌పై హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. అతడు ప్రధాని కాలేదనే నిరాశలో దేశ ఆర్థిక పరిస్థితిని అస్థిరపరచడానికి ప్రయత్నిస్తున్నారు. హిండెన్‌బర్గ్ నివేదికను ఆధారంగా చేసుకొని, స్టాక్ మార్కెట్ గురించి అసంతృప్తికర వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రజలు ఆయనను ఎప్పటికీ గెలిపించరు. రాహుల్ ఎప్పటికీ ప్రతిపక్షంలోనే ఉండిపోతారు' అంటూ కంగన ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. రాహుల్ వ్యాఖ్యలపై భాజపా నేత రవిశంకర్ ప్రసాద్ మండిపడ్డారు. భారతీయ స్టాక్ మార్కెట్ క్రాష్ అవ్వాలని, ఎకానమీని ధ్వంసం చేయాలని కాంగ్రెస్ కోరుకుంటుందని దుయ్యబట్టారు. కాగా హిండెన్‌బర్గ్ నివేదికపై రాహుల్ గాంధీ స్పందిస్తూ.. 'సెబీ' పవిత్రత దెబ్బతిందని విమర్శించారు. 'ఛైర్‌పర్సన్‌పై వచ్చిన ఆరోపణలతో సెబీ పవిత్రత మసకబారింది. దేశవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు ప్రస్తుతం ప్రభుత్వానికి మూడు ప్రశ్నలు వేస్తున్నారు. సెబీ ఛైర్‌పర్సన్ మాధవీ పురి ఇంకా ఎందుకు రాజీనామా చేయలేదు? ఒకవేళ ఇన్వెస్టర్లు తాము కష్టపడి సంపాదించిన డబ్బును కోల్పోతే.. ఎవరు జవాబుదారీగా ఉంటారు? ప్రధాని మోదీనా? సెబీ ఛైర్‌పర్సనా? లేదా అదానీనా? ఈ అంశాన్ని సుప్రీం కోర్టు మరోసారి సుమోటోగా పరిశీలిస్తుందా?' అని 'ఎక్స్' వేదికగా ప్రశ్నలు లేవనెత్తారు. దీనివల్ల భారతీయ స్టాక్ మార్కెట్‌లో గణనీయమైన ప్రమాదం పొంచి ఉందనే విషయం ప్రజల దృష్టికి తీసుకురావడం లోక్‌సభా ప్రతిపక్ష నాయకుడిగా తన బాధ్యత అని పేర్కొన్నారు.



# బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువుల రక్షణేది?

- తక్షణ చర్యలు తీసుకోవాలన్న డిప్యూటీ సిఎం పవన్
- హిందువులు లక్ష్యంగా దాడులు సరికాదంటూ ట్వీట్

**అమరావతి, ప్రజానావ:** బంగ్లాదేశ్ పరిస్థితులపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. బంగ్లాదేశ్ నుండి ఇటీవల చిత్రాలు హృదయ విదారకంగా ఉన్నాయన్నారు. బంగ్లాదేశ్ కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు ప్రదీప్ భౌమిక్‌ను పగటి వెలుగులో క్రూరంగా హ్యాకింగ్ చేయడం నుంచి హిందూ దేవాలయాలను (ఇస్కాన్ / కాళీ మాత దేవాలయం) ధ్వంసం చేయడం వరకు మైనారిటీలను దారుణంగా చంపడం, హిందూ మైనారిటీలపై క్రైస్తవులు, బౌద్ధులపై హింసను లక్ష్యంగా చేసుకోవడం వరకు,అహ్మదీయులు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నారన్నారు. బంగ్లాదేశ్‌లో తక్షణ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతలను పునరుద్ధరించాలని తాను భారతదేశంలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌ను కోరుతున్నానన్నారు. బంగ్లాదేశ్‌లోని మైనారిటీలు, హిందువులందరికీ భద్రత, భద్రతతో పాటు స్థిరత్వం కోసం ప్రార్థిస్తున్నాను అంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు. కాగా.. బంగ్లాదేశ్‌లో హిందువుల ఆలయాలు, ఇళ్లు, వ్యాపార సంస్థలపై దాడిని నిరసిస్తూ ఢాకా, చట్టగ్రాం నగరాలలో వరుసగా రెండోరోజూ వేలాదిమంది హిందువులు ఆందోళనలు నిర్వహించారు. వారికి సంఘీభావంగా వేలాదిమంది ముస్లింలు, విద్యార్థులు ఆందోళనల్లో పాల్గొన్నారు. మైనారిటీలను వేధిస్తున్నవారిపై విచారణ వేగవంతానికి ప్రత్యేక ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేయాలని, పార్లమెంటులో 10 శాతం సీట్లను మైనారిటీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఢాకాలోని షాబాగ్ ప్రాంతంలో నిరసన సందర్భంగా మూడు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. మరోవైపు బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాత్మక దాడులు పెరగడాన్ని నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తాయి. దాడులను ఖండిస్తూ లండన్, వాషింగ్టన్ డీసీ సహా ప్రధాన నగరాలలో ప్రదర్శనలు నిర్వహించారు. లండన్‌లోని పార్లమెంటు భవనం ఎదుట ఆందోళనకారులు బంగ్లాదేశ్ జెండా, చిహ్నాలతో నిరసన తెలిపారు. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వివిధ మానవహక్కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం వద్ద కూడా శనివారం ఆందోళన నిర్వహించారు. కాగా, దేశంలో మైనారిటీలపై జరుగుతున్న దాడుల్ని బంగ్లాదేశ్ తాత్కాలిక నేత మొహమ్మద్ యూనస్ ఖండించారు. హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులను కాపాడవలసిందిగా యువతను కోరారు.

# హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజా ఆరోపణలు

## ఆదానీ గ్రూప్ స్టక్స్‌కు భారీ కుదుపులు

**న్యూఢిల్లీ:** అమెరికా షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజా ఆరోపణలు మరోసారి అదానీ గ్రూప్‌స్టాక్స్‌ను కుదిపేశాయి. ఈసారి అదానీ గ్రూప్ సంస్థలను నేరుగా లక్ష్యంగా చేసుకోనప్పటికీ.. గతంలో చేసిన ఆరోపణలకు కొనసాగింపుగా ఈసారి సెబీ చీఫ్‌ను ఈ వ్యవహారంలోకి లాగడం గమనార్హం. దీంతో అదానీ గ్రూప్ స్టాక్స్‌పై మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడంతో ఆ గ్రూప్ కంపెనీల షేర్లన్నీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ఈ ఉదయం బీఎస్‌ఈలో ఏకంగా 17 శాతం మేర నష్టపోయింది. అదానీ టోటల్ గ్యాస్ 13.39 శాతం, ఎన్డీటీవీ 11 శాతం, అదానీ పవర్ 10.94 శాతం చొప్పున నష్టపోయాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 6.96 శాతం, అదానీ విల్మర్ 6.49 శాతం, అదానీ ఎంటర్ ప్రైజెస్ 5.43 శాతం, అదానీ పోర్ట్స్ 4.95 శాతం, అంబుజా సిమెంట్స్ 2.53 శాతం, ఏసీసీ 2.42 శాతం చొప్పున నష్టపోయాయి. అయితే, తర్వాత కాస్త కోలుకున్నాయి. గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ నియంత్రణలోని కొన్ని బెర్ముడా, మారిషస్ ఫండ్‌లలో సెబీ చీఫ్ మాధబి పురి, ఆమె భర్త ధావల్ బచ్‌లు 2015లో పెట్టుబడులు పెట్టారు. ఈ దంపతుల వాటాల నికర విలువ 10 మిలియన్ డాలర్ల (సుమారు రూ.83 కోట్లు) వరకు ఉండొచ్చని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. 2017లో సెబీ పూర్తికాలపు సభ్యురాలిగా మాధబి నియమితులయ్యారు. 2022 మార్చిలో సెబీ ఛైర్‌పర్సన్‌గా పదోన్నతి పొందారు. తమకు వాటాలున్న విదేశీ సంస్థలు కనుకే, అదానీ గ్రూప్‌పై సెబీ విచారణ తూతూమంత్రంగా జరిగేలా చేశారన్నది హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణ. దీన్ని సెబీ చీఫ్‌తో పాటు అదానీ గ్రూప్ కూడా ఖండించింది. అయితే తమ ఆరోపణలను ఖండిస్తూ సెబీ చీఫ్ మాధబి బచ్ చేసిన ప్రకటన మరిన్ని సంక్లిష్ట ప్రశ్నలు లేవనెత్తుతోందని అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ పేర్కొంది. సెబీ చీఫ్ స్పందనపై ఆ సంస్థ ఆదివారం రాత్రి మరోసారి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించింది. మాధబి స్పందనలో ఆమెకు బెర్ముడా/మారిషస్ ఫండ్లు ఉన్నాయన్న విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయని పేర్కొంది. దీంతోపాటు ఆ ఫండ్స్‌ను ఆమె భర్త ధావల్ చిన్ననాటి మిత్రుడు నడుపుతున్న విషయం కూడా తేలిందని పేర్కొంది. ప్రస్తుతం అతడు అదానీ గ్రూపులో డైరెక్టర్‌గా చేస్తున్నారని వెల్లడించింది. అదానీ విషయంలో దర్యాప్తు చేసే బాధ్యతను సెబీకి అప్పగించారు. వాటిల్లో బచ్ వ్యక్తిగత పెట్టుబడులు, ఇతర స్పాన్సర్ల నిధులు ఉన్నాయని వెల్లడించింది. ఇది విరుద్ధ ప్రయోజనాల అంశం కిందకు వస్తుందని ఆరోపించింది. సెబీలో నియామకంతో ఆమె 2017లో స్థాపించిన కంపెనీలు నిద్రాణమైపోయాయని పేర్కొంది. 2019లో ఆమె భర్త సదరు సంస్థల బాధ్యతను స్వీకరించారని వెల్లడించింది. అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువలు కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో మాధబి పురి, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ తాజాగా ఆరోపించింది. అదానీకి చెందిన మారిషస్, ఆఫ్‌షోర్ షెల్ సంస్థల వివరాలను తెలుసుకోవడంలో సెబీ ఆసక్తి చూపకపోవడం తమను ఆశ్చర్యపరిచిందని పేర్కొంది. ఈ ఆరోపణలను సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్ తోసిపుచ్చారు. హిండెన్‌బర్గ్ ఆరోపణలను ఖండిస్తూ మాధబి, ఆమె భర్త ధావల్ బచ్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. హిండెన్‌బర్గ్ ఆరోపణలు ఆధారరహితమని, ఎటువంటి నిజాలు లేవన్నారు. 'మా జీవితం, ఆర్థిక అంశాలు తెరిచిన పుస్తకం. అదానీ గ్రూప్‌పై సెబీ విచారణ జరిపాక, హిండెన్‌బర్గ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఇందుకు ప్రతిస్పందనగా మా వ్యక్తిత్వ హననానికి ఆ సంస్థ పాల్పడటం చాలా దురదృష్టకరం' అని అన్నారు. మరోవైపు హిండెన్‌బర్గ్ ఆరోపణలు అర్థరహితమని కొట్టిపారేశారు. బచ్‌తో ఎటువంటి వాణిజ్య సంబంధాలు తమకు లేవని అదానీ గ్రూప్ స్పష్టంచేసింది.

# సుప్రీంలో కవితకు దక్కని ఊరట

- మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ
- ఈడీ, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ
- విచారణ ఆగస్ట్ 20కి వాయిదా వేసిన ధర్మాసనం



**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టులో కవితకు ఊరట దక్కలేదు. ఆమెకు మధ్యతంర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం తిరస్కరించింది. ఆమె బెయిల్ పిటిషన్‌పై సోమ వారం విచారణ జరిగింది. కవిత పిటిషన్‌పై సుప్రీంకోర్టు పెద్ద ట్విస్ట్ ఇచ్చింది. ఈడీ, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. స్పందన తెలియజేయాలని కేంద్ర ఏజెన్సీలను కోర్టు కోరింది. తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసుపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథ్ ధర్మాసనం విచారణ జరిపింది.సీబీఐ, ఈడీ కేసులలో బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు తీర్పును కవిత సవాల్ చేశారు. మార్చి 15న కవితను ఈడీ అరెస్టు చేయగా.. ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది. ఇక కవిత తరుఫున న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. 5 నెలల నుంచి ఆమె జైల్లో ఉన్నారు. 463 మంది సాక్షులను విచారించామని ధర్మాసనం పేర్కొంది. కాగా ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే కవితకు ట్రయల్ కోర్టు, ఢిల్లీ హై కోర్టు బెయిల్ నిరాకరించాయి. దీంతో ఆమె ఆశలన్నీ సుప్రీంకోర్టు పైనే పెట్టుకున్నారు. ఇవాళ తనకు బెయిల్ వస్తుందని ఆమె భావించినట్టు సమాచారం. తనపై ఈడీ, సీబీఐలు నమోదు చేసిన కేసుల్లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత ఈ నెల 8న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జూలై 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేశారు. సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. అక్కడ కూడా వాయిదా పడింది. ఇక బెయిల్ కోసం మరో వారం పాటు కవిత వేచిచూ?డాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పుడైనా బెయిల్ వస్తుందో రాదో వేచిచూడాల్సి ఉంది.ప్రస్తుతం కవిత తీహార్ జైల్లో ఉన్నారు. ఆమెను బయటకు తీసుకొచ్చేందుకు ఆమె కుటుంబం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఇటీవలే ఢిల్లీకి వెళ్లారు. ఆ సమయంలో వారిద్దరూ కవితకు బెయిల్ అంశంపై చర్చించారని జోరుగా ప్రచారం సాగింది. ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ కోర్టులో నిరాశే ఎదురవ్వడం గమనార్హం.ఢిల్లీ హైకోర్టులో ఢిల్లీ మద్యం పాలసీ కేసులో దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో 50 మందిని నిందితులుగా పేర్కొన్నాయని... అందులో కవిత మాత్రమే మహిళ అని ఆమె తరుపు సీనియర్ న్యాయవాదులు గతంలో ఢిల్లీ హైకోర్టులో వాదించారు. మహిళలకు కొన్ని ప్రత్యేక వెసులుబాట్లను చట్టాలు కల్పించాయని తెలిపారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కవితకు బెయిల్ ఇవ్వాలన్నారు. మహిళలకు ప్రత్యేక రక్షణలు ఉన్నాయని వాటి కింద కవితకు బెయిల్ ఇవ్వాలని కవిత తరఫున న్యాయవాదులు వినిపించిన వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు.

# కమ్‌బ్యాక్ కష్టమే!

## • రహానే, పుజారాలకు సెలక్టర్ల గుడ్ బై • దులీప్ ట్రోఫీలో దక్కని చోటు

**న్యూఢిల్లీ:** భారత వెటరన్ ప్లేయర్లు.. టెస్ట్ స్పెషలిస్ట్ అజింక్య రహానే, చతేశ్వర్ పుజారా ఇకపై టీంఇండియాలో కనిపించడం కష్టంగానే కనిపిస్తుంది. దశాబ్దకాలంగా భారత టెస్ట్ జట్టులో కీలక పాత్ర పోషించి ద్రావిడ్, లక్ష్మణ్ వారసులుగా పేరు తెచ్చుకున్నారు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ వంటి దేశాలలో భారత్ సాధించిన విజయాల్లో వీరు కీలక పాత్ర పోషించారు. మూడో స్థానంలో పుజారా అడ్డుగోడలా నిలబడితే.. ఐదో స్థానంలో రహానే నిలకడగా రాణించాడు. బాగా ఆడవుతూ టెస్టుల్లో వీరి స్థానం సుస్థిరం చేసుకున్నారు.



### గడ్డుకాలం..

పుజారా, రహానే లకు ప్రస్తుతం గడ్డు కాలం నడుస్తుంది. వీరు కంబ్యాక్ ఇవ్వడం కూడా కష్టంగానే కనిపిస్తుంది. తాజాగా సెలక్టర్లు వీరిని దులీప్ ట్రోఫీ కోసం పరిగణలోకి తీసుకోట్లేదని సమాచారం. దులీప్ ట్రోఫీ సెప్టెంబర్ 5 నుంచి అనంతపురం (ఆంధ్రప్రదేశ్)లో జరగనుంది. మొత్తం టోర్నీలో ఆరు మ్యాచ్‌లు జరుగుతాయి. రోహిత్, కోహ్లితో పాటు శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, యశస్వి జైస్వాల్, సూర్యకుమార్ యాదవ్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌లను కూడా ఈ ట్రోఫీలో ఆడడం దాదాపుగా ఖాయమైంది. దులీప్ ట్రోఫీకి వీరు ఎంపిక కాకపోతే వీరి టెస్ట్ కెరీర్ దాదాపుగా ముగిసినట్టే. 2023 దక్షిణాఫ్రికా టూర్ లో భాగంగా టెస్టు జట్టు నుంచి ఈ వెటరన్ బ్యాటర్లను సెలక్టర్లు తప్పించిన సంగతి తెలిసిందే. 2020 నుండి పుజారా ఫామ్ దిగజారుతూ వస్తుంది. గత నాలుగేళ్లలో ఈ వెటరన్ ప్లేయర్ 28 టెస్టు మ్యాచ్ లాడితే యావరేజ్ 30 కంటే తక్కువగానే ఉంది. కేవలం ఒకసారి మాత్రమే మూడంకెల స్కోర్ ను చేరుకోగలిగాడు. నిలకడగా రాణించలేకపోవడం పుజారాకు మైనస్ గా మారింది. రహానే 2022 లో దక్షిణాఫ్రికా సిరీస్ తర్వాత పేలవ ఫామ్ తో టెస్టు జట్టులో స్థానం కోల్పోయాడు. అయితే ఐపీఎల్ లో అద్భుతమైన ప్రదర్శనతో డబ్ల్యూటీసీ ఫైనల్లో చోటు సంపాదించిన రహానే రెండు ఇన్నింగ్స్ ల్లో వరుసగా 89,46 పరుగులు చేశాడు. కెరీర్ గాడిలో పడిందనుకున్న సమయంలో జులైలో విండీస్ టూర్ లో జరిగిన టెస్ట్ సిరీస్ లో దారుణంగా విఫలమవడం రహానేకు ప్రతికూలంగా మారింది.



# టీమిండియాకు నిరాశే

## ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా గుస్ అట్కిన్సన్, చమరి ఆటపట్టు

**దుబాయ్:** ఇంగ్లాండ్ సీమర్ గుస్ అట్కిన్సన్ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును గెలుచుకున్నాడు. జులై నెలలో వెస్టిండీస్ జరిగిన టెస్ట్ సిరీస్ లో అద్భుతమైన ప్రదర్శన చేసినందుకు ఈ అవార్డు వరించింది. ఈ అవార్డుకు భారత ప్లేయర్ వాషింగ్ టన్ సందర్ తో పాటు స్కాట్లాండ్ ఫాస్ట్ బౌలర్ చార్లీ కాసెల్ నామినేట్ అయ్యారు. జులై నెలలో వెస్టిండీస్ తో జరిగిన మూడు మ్యాచ్ ల సిరీస్ లో 22 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకున్నాడు. దిగ్గజ పేసర్ అండర్సన్ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఇంగ్లాండ్ టెస్ట్ జట్టులో స్థానం సంపాదించిన అట్కిన్సన్ తొలి మ్యాచ్ లోనే 12 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు తీసి సంచలన ప్రదర్శన చేసిన ఈ యువ పేసర్.. ఆ తర్వాత సెకండ్ ఇన్నింగ్స్‌లో 5 వికెట్లతో ఔరా అనిపించాడు. మహిళల విభాగంలో శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టుకు ఉమెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును గెలుచుకుంది. సుందర్ జింబాబ్వే సిరీస్ లో ఆల్ రౌండ్ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ గెలుచుకున్నాడు. స్కాట్లాండ్ ఫాస్ట్ బౌలర్ చార్లీ కాసెల్ ఒమన్ పై అరంగేట్ర మ్యాచ్ లోనే ఏడు వికెట్లు తీసి అరుదైన రికార్డ్ సృష్టించాడు. టీమిండియా ఆల్ రౌండర్‌కు ఈ అవార్డు వస్తుందని ఆశించినా నిరాశ తప్పలేదు. మహిళల విభాగంలో స్మృతి మందాన, షెఫాలీ వర్మ ఎంపికైనా అవార్డు వరించలేదు.





# హెచ్‌సీఏ ఉమెన్స్ లీగ్ షురూ

- మిథాలీ వంటి మేటి క్రికెటర్లను తయారు చేస్తాం
- టీమిండియా, డబ్ల్యూపీఎల్‌కు తెలంగాణ ఆడబిడ్డలను ఆడించడమే లక్ష్యం
- హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు

**హైదరాబాద్ స్పోర్ట్స్, ప్రజానావ:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) చరిత్రలో తొలిసారిగా మహిళా క్రికెటర్ల కోసం ఉమెన్స్ లీగ్‌ను ప్రారంభించినట్టు ఆ సంఘం అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు వెల్లడించారు. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఉమెన్స్ లీగ్ ప్రారంభోత్సవంలో జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ అండర్-15లో 12 జట్లు, అండర్-17లో 12 జట్లు, అండర్-19లో ఆరు జట్లు పోటీ పడనున్నాయని చెప్పారు. 15 రోజుల పాటు జరగనున్న ఈ లీగ్‌లో సుమారు 450 మంది మహిళా క్రికెటర్లు ఆడనున్నారని చెప్పారు. మ్యాచ్‌లన్నీ హైదరాబాద్ కేంద్రంగానే జరగనున్నా యని, ప్రతి జట్టు ఒక్క మ్యాచ్ అయినా ఉప్పల్‌లో ఆడేలా షెడ్యూల్ రూపొందించామని పేర్కొన్నా రు. భారత జట్టు మాజీ కెప్టెన్, హైదరాబాద్ దిగ్గజ క్రికెటర్ మిథాలీ రాజ్ వంటి మేటి క్రికెటర్లను తయారు చేయాలనే ఆశయంతో ఈ లీగ్‌కు రూపకల్పన చేశామన్నారు. భవిష్యత్‌లో టీమిండియా, డబ్ల్యూపీఎల్‌కు తెలంగాణ ఆడబిడ్డ లను ఆడించడమే తమ లక్ష్యమని తెలిపారు. అలానే తన సహచర అపెక్స్ కౌన్సిల్ సభ్యులతో చర్చించి, అన్ని సదుపాయాలున్న మహిళా క్రికెట్ అకాడమీ కూడా స్థాపించేందుకు కృషి చేస్తానని జగన్‌మోహన్ రావు చెప్పారు.





# ఖాళీ చేతులతో దేశానికి వినేష్ ఫోగట్

## • పిటిషన్‌పై కొనసాగుతున్న సస్పెన్స్ • తీర్పు వాయిదా వేసిన పారిస్ స్పోర్ట్స్ కోర్టు

**పారిస్:** వినేశ్ ఫోగట్ పిటిషన్‌పై సస్పెన్స్ ఇంకా కంటిన్యూ అవుతూనే ఉంది. ఆగస్టు పదిన ఆమె పిటిషన్ పై తీర్పు వస్తుందని అందరూ అనుకున్నప్పటికీ.. పారిస్ స్పోర్ట్స్ కోర్టు తీర్పు వాయిదా వేసింది. కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)లో వినేష్ ఫోగట్ పిటిషన్ పై విచారణ జరిగింది. కనీసం ఆదివారమైనా తీర్పు వెలువడుతుందని అందరూ ఆశించారు. కానీ ఈ నెల 13న తీర్పు వెలువడనుంది. కాగా.. అదే రోజు వినేష్ ఫోగట్ భారత్ కు తిరిగి రానుంది. అయితే ఒట్టి చేతులతో ఆమె పారిస్ ఒలింపిక్స్ నుంచి తిరిగి వస్తుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. తీర్పు పూర్తివకుండానే భారత్ కు తిరిగి రావడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పారిస్ ఒలింపిక్స్ 2024 ముగిసిన తర్వాత.. ఇప్పుడు భారత అథ్లెట్లు దేశానికి తిరిగి వస్తున్నారు. ఈ బృందం మంగళవారంఉదయం తిరిగి రానుంది. వారితో పాటు స్టార్ రెజ్లర్ వినేష్ ఫోగట్ కూడా తన ఇంటికి తిరిగి వస్తుంది. వినేష్ రజత పతకానికి సంబంధించి కూడా అదే రోజు నిర్ణయం తీసుకోనున్నారు. ఒలింపిక్ గోల్డ్ మెడల్ మ్యాచ్‌కు ముందు కంటే ఆమె బరువు 100 గ్రాములు ఎక్కువగా ఉన్నందున పోటీకి ముందు అనర్హత సాధించిన విషయం తెలిసిందే. పారిస్ ఒలింపిక్స్ జులై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరిగాయని తెలిసిందే. దీని కోసం, 117 మంది సభ్యులతో కూడిన భారత బృందం పారిస్‌కు వెళ్లింది. అందులో చాలా మంది అథ్లెట్లు తిరిగి వచ్చారు. అయితే ముగింపు వేడుకలో 'పరేడ్ ఆఫ్ నేషన్స్'కి భారత పతాకధారులుగా పిఆర్ శ్రీజేష్, మను భాకర్‌తో సహా ఇతర అథ్లెట్లు.. భారత బృందం మంగళవారం ఉదయం దేశానికి తిరిగి వస్తారు.

# బరువు కొలిచే నియమాల్లో మార్పులు

**పారిస్:** పారిస్ ఒలింపిక్స్లో భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పై అనర్హత వేటు వేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఫైనల్కు చేరిన తర్వాత 100 గ్రాముల అదనపు బరువు ఉందని ఆమెపై అనర్హత వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని ఇతర దేశాల రెజ్లర్లు సైతం వ్యతిరేకించారు. ఈ క్రమంలో ప్రపంచ రెజ్లింగ్ గవర్నింగ్ బాడీ, యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక నుంచి రెజ్లర్ల బరువు కొలిచే నియమ నిబంధనల్లో మార్పులు చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం. అయితే, ఈ మార్పులు పూర్తిస్థాయిలో కాకుండా అథ్లెట్ల భద్రత, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని స్వల్ప మార్పులు చేస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మార్పులను త్వరలోనే అమల్లోకి తీసుకువచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. 50 కేజీల విభాగంలో పోటీపడి



100 గ్రాముల అదనపు బరువుతో అనర్హతకు గురైె వినేశ్ ఫొగాట్ న్యాయపోరాటం చేస్తోంది. అనర్హతను సవాలు చేస్తూ కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏటఎస్)ను ఆశ్రయించింది. ఆమె అప్పీల్ను విచారణకు స్వీకరించిన కాస్ మంగళవారం (ఆగస్టు 13న) సాయంత్రం ఆరు గంటల్లోగా తుది తీర్పును వెల్లడించనుంది.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657